www.prajapaksham.in
# ప్రజాపక్షం
ప్రతి అక్షరం ప్రజల కోసం
స్తంభాద్రి భద్రాద్రి
సోమవారం | 25 | ఆగస్టు | 2025 పేజీలు : 8

## అనర్హులకు ఇందిరమ్మ ఇండ్లు..!



-లక్ష రూపాయలు చెల్లింపు అధికారులపై చర్యలేవి?

2 లో

# జిల్లాలో కాంట్రాక్టీకరణ..!





**-నచ్చిన, మెచ్చిన గుత్తేదారులకే పనులు**
**-నేతల అనుచరులు కావడంతో కన్నెత్తి చూడని అధికారులు**
**-నాణ్యతకు తిలోదకాలు**

**ప్రజాపక్షం/ ఖమ్మం :** ఒకప్పుడు బహిరంగ పద్ధతుల్లో గుత్తేదారులు పనులు చేజిక్కించుకునే వారు. ఆ తర్వాత సీల్డ్ టెండర్ల విధానం వచ్చింది. అతి తక్కువ ధరకు కోట్ చేసిన వారికి అధికార యంత్రాంగం పనులు అప్పగించేది. ఒప్పందం ప్రకారం గుత్తేదారులు పనులు చేస్తున్నాడా లేదా అని అధికార యంత్రాంగం పర్యవేక్షణ చేసేది. నాణ్యతా లోపాలను ఎత్తిచూపి పనుల నిలుపుదల చేయడం, బిల్లులను చెల్లించకుండా ఉండడం తదితర చర్యలు తీసుకునే వారు. ఇప్పుడు టెండర్ల స్థానే కాంట్రాక్టీకరణ పద్ధతి అమలవుతుంది. ముఖ్యంగా ఖమ్మం జిల్లాలో అధికార పార్టీ కనుసన్నల్లో ఉన్న గుత్తేదారులు ఒక వెలుగు వెలుగుతున్నారు. పనులు ఎట్లా ఉన్న ప్రజా ప్రతినిధికి దగ్గరగా ఉంటే చాలు పని దక్కించుకోవడం మొదలు బిల్లుల చెల్లింపుల వరకు అన్ని సాఫీగా జరిగిపోతాయన్న

మిగతా 2లో..

### రాజకీయాలకతీతంగా
## సంక్షేమ పథకాలు



**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్:** రాజకీయాలకు అతీతంగా అర్హులైన పేదలందరికీ సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నామని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. చేసిన అభివృద్ధి పది కాలాల పాటు నిలవాలని మంత్రి తెలిపారు. మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆదివారం ఖమ్మం నగరంలోని

మిగతా 2లో..

**-చేసిన అభివృద్ధి పది కాలాల పాటు నిలవాలి**
**-సిసి రోడ్లు, డ్రైన్ నిర్మాణ పనులకు మంత్రి తుమ్మల శంకుస్థాపన**
**-ఇందిరమ్మ ఇండ్ల పట్టాలు పంపిణీ**

## గిరిజన బాలికపై సామూహిక అత్యాచారం

**చర్లలో దారుణానికి ఒడిగట్టిన ఆటో డ్రైవర్లు**



**ప్రజాపక్షం/ ఖమ్మం :** గిరిజన బాలికపై అత్యంత పాశవికంగా అత్యాచారానికి పాల్పడిన ఘటన భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో చోటు చేసుకుంది. ఈ ఘటనకు సంబంధించి నిందితుల కోసం పోలీసులు ప్రత్యేక బృందాలుగా ఏర్పడి గాలిస్తున్నారు. ఈ ఘటన వివరాల్లోకి వెళితే... ఛత్తీస్‌ఘఢ్‌కు చెందిన గిరిజన బాలిక ములుగు జిల్లా వాజేడు వెళ్లేందుకు భద్రాద్రి కొత్తగూడెంజిల్లా చర్లకు చేరుకుంది. చర్ల నుంచి వాజేడు వెళ్లేందుకు ఆటో ఎక్కింది. గిరిజన బాలికపై కన్నేసిన ఆటో డ్రైవర్లు ఆమెకు కూల్‌డ్రింక్‌లో మత్తు మందు కలిపి ఇచ్చారు. ఆమెపై అత్యాచారం చేసిన అనంతరం పాల్వంచ సమీపంలోని పెద్దమ్మగుడి జగన్నాథపురం గ్రామాల మధ్య రోడ్డు పక్కన వదిలేసి వెళ్లారు. స్థానికులు గాయాలతో ఉన్న ఆమెను చూసి బాలిక సంరక్షణ కేంద్రానికి సమాచారమిచ్చారు. అధికారులు వెంటనే స్పందించి ఆమెను బాలిక సంరక్షణ కేంద్రానికి తరలించారు. ఆమె శరీరంపై తీవ్రమైన గాయాలు ఉన్నాయి. బాలిక శరీరంపై ఉన్న గాయాలను చూసి స్థానికులు, పోలీసులు చలించిపోయారు. ఈ అమానవీయ ఘటనపై భద్రాద్రి పోలీసులు వెంటనే స్పందించారు. విషయం తెలిసిన వెంటనే భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఎస్‌పి రోహిత్‌రాజ్ చర్ల, పాల్వంచ, దుమ్ముగూడెం పోలీసులతో కలిసి ప్రత్యేక పోలీస్ బృందాలను ఏర్పాటు చేసి నిందితుల కోసం దర్యాప్తు చేస్తున్నాయి. ఈ అత్యాచార ఘటన ఉమ్మడి ఖమ్మం జిల్లాలో తీవ్ర కలకలాన్ని రేపింది.

# జిల్లాలో కాంట్రాక్టీకరణ..!

(మొదటపేజీ తరువాయి)

భావన గుత్తేదారుల్లో బలపడింది. అభివృద్ధి పనులు ప్రతిపాదన, నిధుల మంజూరీతో పాటు ఎవరికి పనులు అప్పగించాలో ప్రజాప్రతినిధులే నిర్ణయిస్తున్నారు. దీనితో ఇక టెండర్ కోటేషన్ విధానం నామ మాత్రమైంది. కాంట్రాక్టీకరణ పద్దతి జిల్లాలో అమల్లోకి వచ్చిన తర్వాత అధికార యంత్రాంగం చేష్టలూడిగి చూస్తుండిపోవడం తప్ప ఏమి చేయ లేని పరిస్థితి. నాణ్యత విషయంలో రాజీ పడలేక ఏ అధికారి అయినా ఇదేం పని అని అన్నాడా అంతే సంగతులు. ఆన్‌లైన్‌లో బదిలీ ఆర్డర్ చూసుకోవాల్సి వస్తుంది. అందుకే అధికార యంత్రాంగం అభివృద్ధి పనుల విషయంలో చూసి చూడనట్లుగా వ్యవహరిస్తూ తిలాపాపం తలా పిడికడు అన్నట్లు ఇచ్చిన కాడికి పుచ్చుకుని నిరభ్యంతర ధృవీకరణ జారీ చేసే పనిలో ఉన్నారు. కాంట్రాక్టీకరణ పద్దతి వచ్చిన తర్వాత నాణ్యతకు తిలోదకాలు ఇచ్చారు. కాంట్రాక్టర్ ఎంపికతో పాటే సంబంధిత పర్యవేక్షించే ఇంజనీరింగ్, సంబంధిత అధికారులు సైతం ప్రజాప్రతినిధుల ఆమోద యోగ్యం మేరకే నియామకం జరుగుతుంది. వారు ఎంపిక చేసిన గుత్తేదారులు, వారు తెచ్చుకున్న అధికారులు, వారు మంజూరీ చేయిస్తున్న నిధులు ఈ మూడింటి నడుమ నాణ్యత కనుమరుగైంది. పది కాలాల పాటు మన్నాల్సిన అభివృద్ధి పనులు ఆరు నెలలకే బీటలు వారుతున్నాయి. మండలానికో గుత్తేదారు ఇష్టానుసారంగా చెలామణి అవుతున్నారు. సొంత పార్టీల నేతలు నాణ్యతపై ఫిర్యాదు చేసినా పట్టించుకునే స్థితిలో లేని దయనీయ స్థితి నెలకొన్నది. ఇక అధికార యంత్రాంగానికి గతంలో నాణ్యతపై ఫిర్యాదులు వస్తే వెంటనే తనిఖీలు చేసేవారు. నాణ్యతా లోపం ఉంటే తగు చర్యలు తీసుకునే వారు ఇప్పుడు ఆ పరిస్థితి లేదు. ఎవరైనా ఫిర్యాదు చేస్తే మీరే సారూకు ఓ మాట చెప్పిండి అంటున్నారు తప్ప చర్యలు తీసుకునే స్థితిలో లేరు. ప్రజాప్రతినిధులు తమ వారికే అభివృద్ధి పనులు అప్పగించే క్రమంలోనే ఇటువంటివి చోటు చేసుకుంటున్నాయి. అవి రోడ్లయినా, కాలువలైనా, బడి అయినా, భవనమైనా మరి ఏపని అయినా తమకు నచ్చిన వారికి, మెచ్చిన వారికి పనులు అప్పగించే పనిలో ఉన్నారు. ఇదే సమయంలో ఎవరు అధికారంలో ఉంటే వారికి సన్నిహితంగా ఉంటూ ఏదో ఒక రూపంలో ప్రసన్నం చేసుకునే గుత్తేదారులకు ఇప్పుడు ఒకరకంగా స్వర్ణ యుగంలా ఉంది. తాము ఏమి చేసినా అభ్యంతరం చెప్పని అధికార యంత్రాంగం, అడగగానే బిల్లులు మంజూరు చేసే ప్రభుత్వం, క్షేత్ర స్థాయి నుంచి ఫిర్యాదులు లేకపోవడం వారి పాలిట వరంగా మారింది. కొంత మంది గుత్తేదారులు ఎందుకైనా మంచిదని తులమో ఫలమో ఇచ్చి స్థానిక నాయకులను సైతం ప్రసన్నం చేసుకుంటున్నారన్న ఆరోపణలు వినవస్తున్నాయి. ఇది ఇప్పుడే వచ్చింది కాదు ఒక దశాబ్ద కాలంగా ప్రజాప్రతినిధులే నిధులు మంజూరు చేయించుకుని వారే తమ అనుచర గుత్తేదారులకు పనులు అప్పగించడం ఆనవాయితీగా మారింది. ఇక్కడ మరో విమర్శ కూడా వినపడుతుంది. అదేమిటంటే పనులకు సంబంధించి అంచనాలు రూపొందించేటప్పుడే అవినీతి చోటు చేసుకుంటుందని కమిషన్లు ఇచ్చుకోవడాలు పోను కాస్త దండిగానే మిగిలేవిధంగా అంచనాలు రూపొందిస్తున్నారన్న ఆరోపణలు వినపడుతున్నాయి. ఉమ్మడి ఖమ్మంజిల్లాలో కోట్లాది రూపాయల అభివృద్ధి పనులు నడుస్తున్నాయి. ఈ పనులకు సంబంధించి ఇంజనీరింగ్ అధికారులు పనులు జరుగుతున్న వైపు కన్నెత్తి చూడటం లేదు. క్వాలిటీ కంట్రోల్ అధికారుల తీరుపై తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి. క్వాలిటీ కంట్రోల్ అధికారులు గుత్తేదారుల వలలో చిక్కుకున్నారని వారు చెప్పిన దానినే వింటూ నాణ్యతను ధృవీకరిస్తున్నారని ఆరోపణలు వినవస్తున్నాయి. ప్రజాప్రతినిధులు ఇప్పటికైనా ఈ కాంట్రాక్టీకరణ పద్దతికి స్వస్తి చెప్పాలని అభివృద్ధి పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని రాజకీయ జోక్యాన్ని నిలువరించాలని ప్రజలు కోరుతున్నారు.

# రాజకీయాలకతీతంగా సంక్షేమ పథకాలు





(మొదటపేజీ తరువాయి)

57వ డివిజన్ రమణగుట్ట ప్రాంతంలో రూ. 2.36 కోట్లతో నిర్మించనున్న సిసి రోడ్లు, డ్రైనేజీ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల మాట్లాడుతూ 57వ డివిజన్ ప్రాంతంలో పేదలు ఎక్కువగా ఉన్నారని స్థానిక నాయకులు కోరిన మీదట ప్రభుత్వం నుంచి వచ్చిన నిధులను అధికంగా ఇక్కడ కేటాయించడం జరిగిందన్నారు. ఖమ్మం నగరంలో రెండువేల ఇండ్లు మంజూరు చేస్తే ఒక్క 57వ డివిజన్ పరిధిలోనే 200 ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేశామన్నారు. అర్హులైన పేదలందరికీ విడతల వారీగా ఇండ్లు మంజూరు చేస్తామన్నారు. పేదలకు ఇండ్ల పట్టాల పంపిణీకి సాధ్యమైనంత మేర కృషి చేస్తామని తెలిపారు. రాజకీయాలకు అతీతంగా నిరుపేదలకు సంక్షేమ పథకాలు అందించడమే తన లక్ష్యమన్నారు. ఖమ్మం నగరాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి ఆదర్శ నగరంగా తీర్చిదిద్దనున్నట్లు ఆయన తెలిపారు. లబ్దిదారులు ఇందిరమ్మ ఇండ్లను త్వరగా నిర్మించుకునేలా చూడాలన్నారు. డివిజన్లలో చేపట్టిన సిసి రోడ్లు, డ్రైన్ నిర్మాణ పనులు నాణ్యతతో పూర్తి చేయాలని, పాఠశాల నిర్మాణానికి అవసరమైన ప్రతిపాదనలు సమర్పించాలన్నారు. ఇందిరమ్మ ఇండ్ల పట్టాలు, ముఖ్యమంత్రి సహాయ నిధి, కళ్యాణ లక్ష్మి, షాదీముబారక్ చెక్కులు, రేషన్ కార్డులు వంటి సంక్షేమ పథకాలను పేదల ఇంటి వద్దకు వెళ్లి అందించాలన్నారు. మేయర్ పునుకొల్లు నీరజ మాట్లాడుతూ పేదల అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యంగా పనిచేస్తున్నామని తెలిపారు. మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కృషి ఫలితంగా 57 డివిజన్‌లో 230 మంది లబ్దిదారులకు ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయడం జరిగిందన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన మాట మేరకు మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, రూ. 500లకు గ్యాస్ సిలెండర్, 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, సన్నబియ్యం సరఫరా, రేషన్ కార్డులను ప్రభుత్వం జారీ చేస్తుందన్నారు. ఇండోర్ నగరంలో పాటిస్తున్న పారిశుధ్య చర్యలను ఖమ్మం నగరంలో కూడా అమలు చేసేందుకు చర్యలు చేపడతామన్నారు. ఖమ్మం నగరాన్ని పరిశుభ్రంగా ఉంచేందుకు ప్రజలు సహకరించాలన్నారు. అనంతరం మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఇందిరమ్మ ఇండ్ల మంజూరు పత్రాలు, నూతన రేషన్‌కార్డులను లబ్దిదారులకు పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి పుల్లయ్య, ఆర్డివో నర్సింహారావు, మున్సిపల్ ఈఈ రంజిత్, అర్బన్ తహసీల్దార్ సైదులు, మార్కెట్ కమిటీ ఛైర్మన్ యరగర్ల హన్మంతరావు, మాజీ ఎంఎల్‌సి బాలసాని లక్ష్మి నారాయణ, కార్పొరేటర్ రఫీదా బేగం, ముస్తఫా తదితరులు పాల్గొన్నారు.

# సింగరేణి గిరిజన ఉద్యోగుల సంఘం మణుగూరు ఏరియా కమిటీ ఎన్నిక

**ప్రజాపక్షం/మణుగూరు:** సింగరేణి గిరిజన ఉద్యోగుల సంఘం మణుగూరు ఏరియా కమిటీ ఎన్నికలు శనివారం రాత్రి పొద్దుపోయాక స్థానిక సిఈఆర్ క్లబ్‌లో నిర్వహించారు. సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గోళ్ళ రమేష్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి భూక్య కృష్ణమూర్తిల నాయకత్వంలో జరిగిన ఈ ఎన్నికల్లో అధ్యక్షుడిగా భానోత్ నాగేశ్వరరావు, ఓవర్ మ్యాన్, కొండాపురం మైన్ ప్రధాన కార్యదర్శిగా పద్దం శ్రీనివాస్, జనరల్ అసిస్టెంట్, ఓసి టు మైన్, వర్కింగ్ ప్రెసిడెంట్ గా బానోత్ అఖిల్ ఓవర్ మెన్ లను ఎన్నుకోవడం జరిగింది. ఈ ఎన్నికకు పర్యవేక్షకులుగా సంఘం గౌరవ అధ్యక్షుడుమాలోత్ మాణిక్రామ్, సెంట్రల్ ట్రెజరర్ పి ప్రశాంత్, సెంట్రల్ వైస్ ప్రెసిడెంట్ ఎమ్ కరుణాకర్ వ్యవహరించారు. మణుగూరు ఏరియా సంఘం గౌరవ అధ్యక్షులుగా టి మధుసూదనరావు, అసిస్టెంట్ మేనేజర్, వైస్ ప్రెసిడెంట్ లు గా వినోద్ కుమార్, భూక్య రాములు, జి రత్న, ఆర్గనైజింగ్ సెక్రటరీలు డి కృష్ణ, గుగులోతు రమేష్, మూడ్ వెంకటేష్, తోలెం రఘు, జాయింట్ సెక్రటరీలు గా సున్నం మహేష్, ఎల్ మంగీ, సి హెచ్ స్వప్న, పద్దం అనూష, కోశాధికారి భూక్య శ్రావణి, ఉప కోశాధికారి గా పి శ్రావణి, ఎగ్జిక్యూటివ్ మెంబర్లుగా భూక్య స్వరూప, సున్నం స్వరూప లు ఎన్నికయ్యారు. వీరందరూ మణుగూరు ఏరియా గిరిజన ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తూ మూడు సంవత్సరాలు పదవిలో కొనసాగుతారని కేంద్ర అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు తెలియజేశారు.



# అనర్హులకు ఇందిరమ్మ ఇండ్లు..!

**ప్రజాపక్షం/కూసుమంచి:** తెలంగాణ ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా తీసుకొని నిర్వహిస్తున్న ఇందిరమ్మ ఇళ్ల కార్యక్రమం కొందరు అధికారులు చర్యల వల్ల అబాసపాలు కాక తప్పడం లేదు అనే విమర్శలు జనంలో తీవ్ర చర్చనీయాంశంగా నానుతుంది. అందుకు నిదర్శనం కూసుమంచి మండల కేంద్రంలో ఇటీవల కాలంలో జరిగిన ఓ అనర్హులకు ఇల్లు కేటాయింపేనని జనం గుసగుసలాడుతున్నారు. అంతే కాకుండా కూసుమంచి మండల కేంద్రంలో పంచాయితీ కార్యదర్శి ఆమె పై గెజిటెడ్ అధికారి కలిసి చేసిన తప్పుడు నిర్ణయంతో ఒకరికి అనర్హులైన వారికి ఇల్లు కేటాయించారనే విషయం ప్రజాపక్షం పత్రిక ద్వారా బహిర్గతం కావడం వారం రోజులలో వ్యవధిలో కూసుమంచి ఎంపీడీవో పంచాయితీ కార్యదర్శి ద్వారా జరిగిన తప్పిదంపై సదరు అర్హత లేని ఒకరిని ఇందిరమ్మ ఇళ్ల జాబితా నుండి తొలగిస్తున్నామని ప్రకటించడం ఇంకా వారు అక్రమంగా ప్రభుత్వం నుండి తీసుకున్న ఒక లక్ష రూపాయల నగదును సైతం రికవరీ చేస్తామని కూసుమంచి ఎంపీడీవో రామచంద్రరావు చెప్పిన విషయం సైతం పాఠకులకు విధితమే. ఇది ఇలా ఉంగా ఎటువంటి పరిశీలన లేకుండా తప్పుడు పద్ధతుల్లో అధికారులు ఒకరికి ఇల్లు మంజూరు చేయడమంటే ఏమి ఆశించకుండానే చేశారా...అనే చర్చ సైతం ప్రజల నుండి వినిపిస్తోంది. ఒక లక్ష రూపాయలు ఇందిరమ్మ ఇల్లు పేరుతో ప్రజాధనం దుర్వినియోగానికి కారకులైన ప్రభుత్వ అధికారులైన కూసుమంచి పంచాయితీ కార్యదర్శి వారి యొక్క పై గెజిటెడ్ అధికారిపై గాని ఇంకా తప్పుడు సమాచారం ఇచ్చిన సదరు వ్యక్తిపై గాని సంబంధిత అధికారులు ఇప్పటి వరకు ఎటువంటి చర్యలు తీసుకోకపోవడం శోచనీయంగాను దురదృష్టకరంగాను సంబంధిత అధికారుల యొక్క బాధ్యత రహిత చర్యగా ప్రజలు అభివర్ణిస్తున్నారు. ఎటు వైపు విన్న ఏ మూలన విన్న ఒకటే చర్చ తప్పు చేసిన అధికారులపై ఇంకా చర్యలు తీసుకోరా...అంటూ జనం చర్చించుకుంటున్నారు. వీరిపైనే చర్యలు తీసుకోకపోతే ఇంకా మండలంలో అన్ని గ్రామాల్లో ఇదే విధమైన పరిస్థితులు నెలకొనే ప్రమాదం ఉండవచ్చునని గ్రామాల్లో జనం నుండి బలంగా వినిపిస్తోంది. కనుక సంబంధిత అధికారులు ప్రజల అభిప్రాయాలను గౌరవించి స్థానిక ఎంఎల్‌ఏ మంత్రి నియోజకవర్గంలో ఎటువంటి మచ్చ రాకుండా చూడాలని ఇంకా తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకున్న ఇందిరమ్మ ఇళ్ల కార్యక్రమాన్ని పారదర్శకంగా, హేతుబద్ధంగా, నిర్వహించి అక్రమంగా డ్రా చేసిన ఒక లక్ష రూపాయల ప్రజాధనంను సైతం రికవరీ చేసి వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని మరొకరు ఇటువంటి పనులకు పాల్పడకుండా చూడాలని ఇంకా సక్రమమార్గంలో ఇందిరమ్మ ఇళ్ల కార్యక్రమాన్ని నిర్వహించాలని ప్రజలు కోరుతున్నారు.

# స్వరసుధ మాధవరావుకు కళానిధి పురస్కారం

**ప్రజాపక్షం/ ఖమ్మం :** స్వరసుధ మ్యూజిక్ యూనిట్ అధ్యక్షులు, సంగీత దర్శకులు కొమర్రాజు మాధవరావు కళానిధి పురస్కారం దక్కింది. ఆదివారం భీమారం ఆగస్త్య బ్రాహ్మణ భవనంలో వరంగల్ బ్రాహ్మణ ప్రోపెషనల్స్ అఫీషియల్స్ ఆధ్వర్యంలో కళానిధి బిరుదును మాధవరావుకు ప్రధానం చేసి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ప్రో॥ మాడభూషణం, రాజ గోపాలాచార్య, మనోహర్‌రావు, పాలకుర్తి దినకర్, రవీందర్‌రావు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాధవరావును పలువురు అభినందించారు.



# వేర్పుల మిన్నమ్మకు నివాళి

**ప్రజాపక్షం/మణుగూరు:** మణుగూరు మండలం సమితీ సింగారం పంచాయతీ గ్రామవాసి, సిపిఐ సీనియర్ కార్యకర్త వేల్పుల మల్లయ్య భార్య వేర్పుల మిన్నమ్మ దినకర్మలు ఆదివారం జరిగాయి. ఈ కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు స రెడ్డి పుల్లారెడ్డి, జిల్లా సమితి సభ్యులు జంగం మోహన్ రావు, సిపిఐ మణుగూరు పట్టణ కార్యదర్శి దుగ్యాల సుధాకర్, మాజీ ఎంపీపీ ఎడారి రమేష్, మండల సహాయ కార్యదర్శి వేర్పుల నరేష్, కార్యవర్గ సభ్యులు ఆధర్ల రాములు, యనమల సుధాకర్ తదితరులు హాజరై పూలమాలవేసి నివాళులర్పించారు.



# సంస్థాగతంగా బలోపేతానికి కృషి చేయాలి

**ప్రజాపక్షం/ బోనకల్ :** త్వరలో జరుగనున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో బిజెపి అభ్యర్థుల గెలుపులో భాగంగా సంస్థాగతంగా పార్టీ బలోపేతానికి నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని బిజెపి జిల్లా నాయకులు రుద్రప్రదీప్ పిలుపునిచ్చారు. ఆదివారం మండల కేంద్రంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ స్థానిక ఎన్నికల్లో పార్టీ అనుసరించాల్సిన విధివిధానాలపై నాయకులకు దిశానిర్దేశం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో అర్హులకు కాకుండా అనర్హులకు ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేయటంలో అనేక మంది పేదలు ఇండ్లు రాక ఇబ్బందులు పడుతున్నారన్నారు.మండల వ్యాప్తంగా అన్ని గ్రామాల్లో ఉన్న ప్రజా సమస్యలను వివరిస్తూ మండల తహశీల్దార్‌కి వినతిపత్రం అందచేయటం జరిగిందన్నారు.ఈ కార్యక్రమంలో బోనకల్ మండల బిజెపి అధ్యక్షురాలు తాళ్లూరి మౌనిక, దళితమోర్చా ఉపాధ్యక్షులు తాళ్ళూరి సురేష్, నాయకులు మందపల్లి పాపారావుఉ, జంపాల రవి, కాలసాని పరుశురాం, దొంతిబోయిన సురేష్, బెజవాడ నాగరాజు తదితరులు పాల్గొన్నారు.



# పేద ప్రజల యుగస్వరం సురవరం

**-సంతాప సభలో జితేందర్‌రెడ్డి**
**-సుధాకర్‌రెడ్డికి ఘన నివాళి**




**ప్రజాపక్షం/ఖమ్మం :** దేశ వ్యాప్తంగా పేద, కార్మిక వర్గాల గొంతుకగా చట్టసభలలో, బయట తన గళాన్ని, వాణిని వినిపించిన సురవరం సుధాకర్‌రెడ్డి ప్రజల యుగస్వరమని సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి జమ్ముల జితేందర్‌రెడ్డి తెలిపారు. బాల్యంలోనే తిరుగుబాటు పంథాను అవలంభించిన సుధాకర్‌రెడ్డి కడవరకు అదే పంథాను కొనసాగించారని ఆయన తెలిపారు. శుక్రవారం మరణించిన సిపిఐ జాతీయ నాయకులు, మాజీ పార్లమెంట్ సభ్యులు సురవరం సుధాకర్‌రెడ్డి సంతాపసభ సిపిఐ కార్యాలయం గిరిప్రసాద్ భవన్‌లో జరిగింది. సురవరం చిత్రపటానికి సిపిఐ నాయకులు, కార్యకర్తలు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం శింగు నర్సింహారావు అధ్యక్షతన జరిగిన సభలో జమ్ముల జితేందర్‌రెడ్డి మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా విద్యార్థి, యువజన ఉద్యమాలను నిర్మించారని ఆయన తెలిపారు. భారత కమ్యూనిస్టు పార్టీ కర్నూలు జిల్లా కార్యదర్శిగా ప్రారంభమైన ఆయన జీవితం రాష్ట్ర కార్యదర్శిగా, జాతీయ ప్రధాన కార్యదర్శి వరకు సాగిందన్నారు. సురవరం గొంతుక ప్రజల గొంతుకగా పని చేసిందని ఇటీవల కాలంలో భారత పార్లమెంటరీ వ్యవస్థలో గొప్ప అంశాలుగా చెప్పుకునే 18 సంవత్సరాలకే ఓటు హక్కు, సమాచార హక్కు చట్టం, జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం సాధనలో సురవరం కీలక భూమిక పోషించారన్నారు. మార్క్సిస్టు మేధావిగా పేరుగడించిన ఆయన తుదిశ్వాస వరకు కమ్యూనిస్టుల ఐక్యత కోసం పరితపించారని జితేందర్‌రెడ్డి తెలిపారు. సాంప్రదాయ కమ్యూనిస్టు పార్టీ కుటుంబం నుంచి ఉద్యమ వారసత్వాన్ని స్వీకరించిన సురవరం భారత కమ్యూనిస్టు ఉద్యమంలో ఎందరికో ఆదర్శంగా నిలిచారని ఆయన తెలిపారు. సురవరం ఆయన సాధనకు నిరంతరం కృషి చేయడమే మనం ఆయనకు ఇచ్చే ఘన నివాళి అని జితేందర్‌రెడ్డి తెలిపారు. ఖమ్మం జిల్లాతో సురవరానికి ప్రత్యేక అనుబంధం ఉందని ఈ సందర్భంగా ఆయన గుర్తు చేశారు. ఈ సభలో సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు సిద్దినేని కర్ణకుమార్, జిల్లా కార్యవర్గ సభ్యులు పోటు కళావతి, పగడాల మల్లేష్, మేకల శ్రీనివాసరావు, పుచ్చకాయల కమలాకర్, వై. సాంబశివరెడ్డి, కూచిపూడి రవి, జిల్లా సమితి సభ్యులు నూనె శశిధర్, వరదా నర్సింహారావు, ఎస్‌కె సైదా తదితరులు పాల్గొన్నారు.

# సురవరం మృతి ప్రజా ఉద్యమాలకు తీరనిలోటు



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** కమ్యూనిస్టు యోధుడు సురవరం సుధాకర్‌రెడ్డి మృతి ప్రజా ఉద్యమాలకు తీరని లోటని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు పగడాల మల్లేష్ తెలిపారు. శుక్రవారం మృతి చెందిన సిపిఐ మాజీ జాతీయ ప్రధాన కార్యదర్శి సురవరం సుధాకర్ రెడ్డి సంతాప సభ ఆదివారం సిపిఐ వన్‌టౌన్ శాఖ ఆధ్వర్యంలో ముస్తఫానగర్‌లో జరిగింది. ఈ సందర్భంగా సురవరం సుధాకర్‌రెడ్డి చిత్ర పటానికి పగడాల మల్లేష్‌తో పాటు పలువురు నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పగడాల మల్లేష్ మాట్లాడుతూ ఏఐఎస్ఎఫ్ నాయకునిగా తన ప్రస్థానాన్ని ప్రారంభించిన సురవరం సుధాకర్‌రెడ్డి అంచలంచెలుగా ఎదుగుతూ సిపిఐ జాతీయ ప్రధాన కార్యదర్శిగా ఎదిగారన్నారు. పేద ప్రజల సమస్యల పరిష్కారానికి నిరంతరం పోరాటం సాగించారన్నారు. రెండుసార్లు పార్లమెంట్ సభ్యునిగా పనిచేసి ప్రజల గొంతుకగా తన గళాన్ని పార్లమెంటులో వినిపించారన్నారు. ఎన్నో ప్రజా ఉద్యమాలకు నాయకత్వం వహించారన్నారు. తుదిశ్వాస వరకు నమ్మిన సిద్దాంతం కోసం కమ్యూనిస్టుగా పనిచేశారన్నారు. ఆయన మరణం ప్రజా ఉద్యమాలకు, పార్టీకి తీరని లోటన్నారు. ఆయన ఆశయ సాధన కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో వన్‌టౌన్ కార్యదర్శి వరదా నర్సింహారావు, జిల్లా కౌన్సిల్ సభ్యులు మాల కొండయ్య, మాడుగుల నాగేశ్వరరావు, ఎస్‌కె యాకూబ్, డివిజన్ల శాఖ కార్యదర్శులు జొన్నలగడ్డ వెంకటేశ్వర్లు, కారం సామెలు, వై. నాగరాజు, కాట్ల నర్సింహారావు, శీలం నాగేశ్వరరావు, రోశయ్య, గూడూరు వెంకటేశ్వర్లు , నారపోగు నాగమణి, సహదేవ్, మద్దెల శ్రీరాం దుర్గ , చిన్న లింగయ్య, పెద్ద లింగయ్య తదితరులు పాల్గొన్నారు.

# సురవరం సుధాకర్‌రెడ్డి మృతి పట్ల పలు పార్టీ నాయకుల సంతాపం





**ప్రజాపక్షం/వైరా:** భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ ఆల్ ఇండియా మాజీ ప్రధాన కార్యదర్శి కామ్రేడ్ సురవరం సుధాకర్‌రెడ్డి మృతి పట్ల వైరా సిపిఐ కార్యాలయంలో మండల సమితి ఆధ్వర్యంలో సంతాప సభ కార్యక్రమం పార్టీ మండల కార్యదర్శి యామాల గోపాలరావు అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా యామాల గోపాలరావు సురవరం సుధాకర్‌రెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమానికి సిపిఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు, వైరా నియోజకవర్గ ఇంచార్జి యర్రా బాబు, సిపిఐ(ఎం) రాష్ట్ర నాయకులు బొంతు రాంబాబు, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు శీలం నర్సిరెడ్డి, సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ నాయకులు కంకణాల అర్జున్‌రావు, టిడిపి పట్టణ అధ్యక్షులు బొల్లేపల్లి శ్రీనివాసరావు, బిఆర్ఎస్ మండల, పట్టణ అధ్యక్షులు బొల్లేపల్లి వెంకటేశ్వరరావు, మద్దెల రవిలతో పాటు పలు పార్టీ నాయకులు పాల్గొని సురవరం సుధాకర్‌రెడ్డి చిత్రపటానికి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ సురవరం సుధాకర్‌రెడ్డి విద్యార్థి దశ నుండే కమ్యూనిస్టు పార్టీకి ఆకర్షితులై భారతదేశంలో అనేక కార్మిక చట్టాలకు అధ్యయనం ఆద్యం పోసిన పీడిత తాడిత ప్రజల ఆశాజ్యోతి అని , ఆయన 1971లో సిపిఐ జాతీయ మండలికి ఎంపికయ్యారు. 1995, 2004లో ఉమ్మడి నల్గొండ జిల్లా నుండి రెండు పర్యాంతరాలు పార్లమెంటు మెంబర్‌గా ఎన్నికై ప్రజల పక్షాన పోరాడి ఎస్సీ, ఎస్టీ, బిసి, మైనార్టీ వర్గాలకు అన్ని విధాలు ఉపయోగపడే విధంగా కేంద్ర ప్రభుత్వంతో మాట్లాడి రాష్ట్ర ప్రజలు ఫ్లోరైడ్ వాటర్ తాగి కాళ్ళు మెలికలు తిరిగిపోతూ ఉండటంతో చూసి చలించిపోయి కేంద్ర ప్రభుత్వంతో మాట్లాడి ఫ్లోరైడ్ రహిత గ్రామాలుగా చూడాలని పోరాడి వాటర్ తీసుకొచ్చి ప్రజలకు త్రాగునీరు అందించిన ఘనత సురవరందేనని అని అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల నాయకులు మిట్టపల్లి రాఘవరావు, గారపాటి అశోక్, కొండా రామకృష్ణ, మూట కొండా, మైక్ షరీ గంజినబోయిన తిరుమలయ్య, మోరు శ్రీనివాసరావు, మోర్ సామేలు, ఆళ్ల రాంబాబు, చింతపల్లి గోపాలరావు, జగదీష్, డేవిడ్‌రాజ్, యాకూబ్‌అలి, సిపిఐ ఎంఎల్ మాస్‌లైన్ నియోజకవర్గ నాయకులు యల్లదండి బాబు, ఏఐటియుసి ఆటో యూనియన్ అధ్యక్షులు రామకృష్ణ, బాబురావు, గోపి, జమీలు, నవీన్, సైదులు, మునేసు, శివ, కాంగ్రెస్ పార్టీ పట్టణ నాయకులు పొదిలి హరినాధ్, టిడిపి పట్టణ నాయకులు గుండ్ల నాగేశ్వరరావు, బోడేపూడి మురళి, నాయకులు రాంబాబు, ముత్తయ్య, రామకృష్ణ, టిఆర్ఎస్ మండల నాయకులు ఏదునూరి శ్రీనివాసరావు, పట్టణ కార్యదర్శి రాయపూడి రవి, వడ్డెర సంఘం జిల్లా నాయకులు ఓర్సు నర్సింహారావు తదితరులు నివాళులు అర్పించిన వారిలో ఉన్నారు.

# యూరియా కొరతను తీర్చండి

**-నేడు రైతు సంఘం ఆధ్వర్యంలో ఆందోళనలు**

**ప్రజాపక్షం/ఖమ్మం :** యూరియా కొరతను నివారించి రైతులకు సకాలంలో అందించాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయాల ముందు సోమవారం ఆందోళన నిర్వహించనున్నట్లు రైతు సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు దొండపాటి రమేష్, కొండపర్తి గోవిందరావు లు తెలిపారు. సకాలంలో యూరియా అందక రైతులు ఇబ్బందులు పడుతున్నారని రానున్న కొద్ది రోజుల్లో కొరత మరింత పెరిగే అవకాశం ఉందని రమేష్, గోవిందరావు లు తెలిపారు. కేంద్ర ప్రభుత్వం తెలంగాణ పట్ల వివక్ష ప్రదర్శిస్తుందని అందులో భాగంగానే యూరియా కొరత సృష్టిస్తున్నారని ఆరోపించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తక్షణం యూరియా కొరతను నివారించాలని డిమాండ్ చేస్తూ సోమవారం జిల్లా వ్యాప్తంగా అన్ని తహసీల్దార్ కార్యాలయాల వద్ద ఆందోళన నిర్వహించనున్నట్లు వారు తెలిపారు. రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

# సురవరం ఓ విప్లవోద్యమ జ్ఞాపిక

**ప్రజాపక్షం/ ఖమ్మం :** ఓ తరం విప్లవోద్యమ జ్ఞాపిక సురవరం సుధాకర్‌రెడ్డి అని ఆయన మరణంతో మార్క్సిస్టు మేధావిని కోల్పోయామని సిపిఐ సీనియర్ నాయకులు, మాజీ శాసనసభ, శాసన మండలి సభ్యులు పువ్వాడ నాగేశ్వరరావు తెలిపారు. సురవరం మృతిపట్ల పువ్వాడ నాగేశ్వరరావు తీవ్ర సంతాపాన్ని, వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలిపారు. విద్యార్థి దశ నుంచే సురవరంతో కలిసి పనిచేశానని ఆ తర్వాత ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర బాధ్యతలను సుధాకర్‌రెడ్డి స్వీకరించారని పువ్వాడ తెలిపారు. ఆరు దశాబ్దాల పాటు కలిసి పనిచేశామని తన జీవితాన్ని పోరాట చరిత్రగా మార్చుకున్న ఘనుడు ఆయన అని పువ్వాడ తెలిపారు. విషయ పరిజ్ఞానం సురవరానికి ఎక్కువని, గొప్ప వక్త, సమకాలిన రాజకీయాలలో తనదైన పంథాతో పనిచేసిన సురవరం నేటి తరానికి మార్గదర్శి అన్నారు. సురవరం ఆశయాలను, ఆకాంక్షలను నేటి తరం ముందుకు తీసుకెళ్లడమే ఆయనకు ఇచ్చే సరైన నివాళి అన్నారు.

# ట్రాక్టర్ మెకానిక్ అసోసియేషన్ ఎన్నిక



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** ఖమ్మం నగర ట్రాక్టర్ మెకానిక్ అసోసియేషన్ నూతన కమిటీని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్ష, కార్యదర్శులు జి. సీతారాంరెడ్డి, కె. శ్యామేందర్‌రెడ్డి ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా సీనియర్ మెకానిక్ లను ఘనంగా సత్కరించారు. అనంతరం సీతారాంరెడ్డి మాట్లాడుతూ ట్రాక్టర్ మెకానిక్‌ల నైపుణ్యతను పెంచేందుకు కంపెనీల ఆధ్వర్యంలో వర్క్‌షాపులను నిర్వహిస్తామన్నారు. ప్రతి ఒక్క మెకానిక్ అసోసియేషన్‌లో సభ్యత్వ నమోదు చేసుకోవాలన్నారు. సభ్యత్వం ఉన్న ప్రతి మెకానిక్‌కు కార్మిక శాఖ లేబర్ కార్డులు అందేలా కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో తారకరామ ఆటో నగర్ అధ్యక్షులు మహంకాళి మల్లికార్జున్, కేసగాని రవి, భీముడు, ఎస్‌కె పాషా, పగడం ప్రసాద్, ఎస్‌కె ఇబ్రహీం, సత్యనారాయణమూర్తి, నాగయ్య, కాశీగౌడ్, సైదారావు, వంశీకృష్ణ, వెంకటరెడ్డి, ఆదినారాయణ, చారి, శ్యామ్, మెకానిక్‌లు తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ డ్రైవర్ల సంఘం సమావేశం



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** తెలంగాణ ప్రభుత్వ డ్రైవర్ల సంఘం ఉమ్మడి ఖమ్మం జిల్లా కార్యవర్గ సమావేశం ఆదివారం సంఘం కార్యాలయం నందు నిర్వహించారు. ఈ సమావేశంలో ఇటీవల పదవి విరమణ పొందిన డ్రైవర్లు బండ్ల నర్సయ్య, మోహన్ లను ఘనంగా సన్మానించారు. అనంతరం సొసైటీ మహాజన సభ నిర్వహించారు. ఈ సమావేశంలో కోర్టు నుంచి వచ్చిన ఇంటిరియమ్ గురించి సభ్యులకు తెలిపారు. త్వరలోనే ప్లాట్లు వచ్చే అవకాశం ఉన్నట్లు తెలిపారు. ఈ సమావేశానికి జిల్లా అధ్యక్షులు వెంకటేశ్వర్లు, సొసైటీ ఛైర్మన్ సలీం, ముఖ్య సలహా దారుడు కె. కోటేశ్వరరావు, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

# సురవరం సుధాకర్‌రెడ్డికు నివాళి



**ప్రజాపక్షం/వైరా:** సిపిఐ మాజీ జాతీయ ప్రధాన కార్యదర్శి కామ్రేడ్ సురవరం సుధాకర్‌రెడ్డి పార్థివదేహానికి డిప్యూటీ సిఎం మల్లు భట్టివిక్రమార్క, జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు పువ్వాళ్ళ దుర్గాప్రసాద్, వైరా ఎమ్మెల్యే రాందాస్‌నాయక్ నివాళులు అర్పించారు. నివాళులు అర్పించిన వారిలో టిపిసిసి ప్రధాన కార్యదర్శి నూతి సత్యనారాయణ, ఖమ్మం జిల్లా ఓబిసి అధ్యక్షుడు పుచ్చకాయల వీరభద్రం, కొణిజర్ల మండల కాంగ్రెస్ అధ్యక్షులు వడ్డే నారాయణరావు తదితరులు ఉన్నారు.

# నివాళులర్పించిన చంద్రావతి



వైరా మాజీ శాసనసభ్యురాలు బానోతు చంద్రావతి ఆదివారం హైదరాబాద్‌లోని మెక్దూం భవన్‌లో సిపిఐ అగ్రనేత, నల్లగొండ మాజీ పార్లమెంటు సభ్యులు సురవరం సుధాకర్‌రెడ్డి పార్థివదేహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. సురవరం సుధాకర్‌రెడ్డి కుటుంబానికి ఆమె ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. బడుగు, బలహీన వార్గల అభ్యున్నతికి వారి సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పోరాటం చేసి పరిష్కరించిన వ్యక్తి సురవరం సుధాకర్‌రెడ్డి అని ఆమె అన్నారు.

## బత్తినేని రాకేష్ జన్మదిన వేడుకలు




**ప్రజాపక్షం/బోనకల్‌:** బత్తినేని ఛారిటబుల్ ట్రస్ట్ ఛైర్మన్ బత్తినేని నాగప్రసాద్, నీరజల ద్వితీయ పుత్రుడు, ప్రముఖ ఎన్ఆర్ఐ బత్తినేని రాకేష్ జన్మదిన వేడుకలను శాంతినిలయం మానసిక వికలాంగుల కేంద్రంలో అదివారం నిర్వహించారు. మానసిక వికలాంగులకు సమక్షంలో బత్తినేని ఛారిటబుల్ ట్రస్ట్ సభ్యులు తూము రోషన్‌కుమార్ కేక్‌కట్ చేసి వేడుకలను జరిపారు. అనంతరం పండ్లు, అన్నదానం కార్యక్రమం నిర్వహించారు. అమెరికాలో స్థిరపడిన రాకేష్, తన సోదరుడు ప్రకాశ్, తన తండ్రి బత్తినేని నాగప్రసాదరావు సమక్షంలో బత్తినేని ఛారిటబుల్ ట్రస్ట్ ద్వారా అనేక సేవాకార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఖమ్మంలో సావరిన్ సాఫ్ట్వేర్ కంపెనీని స్థాపించి 10 మంది ఉద్యోగులతో మొదలై నేడు వేలాది మంది ఉద్యోగులు ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి పొందుతున్నారు. ఎంతోమంది నిరుద్యోగులను ఉద్యోగులు తీర్చిదిద్దిన ఘనత రాకేష్‌ది. మండల కేంద్రంలో ప్రతి నెల మొదటి ఆదివారం తూము ప్రకాశరావు జ్ఞాపకార్థం బిపి, షుగర్, కంటి ప్రత్యేక క్యాంపులు, రాయన్నపేట, నారాయణపురం గ్రామాల్లో వాటర్‌ప్లాంట్లు, క్యాన్సర్ అవగాహన క్యాంపులు, ప్రభుత్వ పాఠశాలల్లో ఫర్నీచర్, పుస్తకాలు, కంప్యూటర్లు అందిస్తూ సేవా కార్యక్రమాలు సాగిస్తున్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి యంగల ఆనందరావు, ఎఐకెఎస్ మండల అధ్యక్షులు కొంగర భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

## నడక వల్ల ఆరోగ్యానికి మేలు




**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** నడక ఆరోగ్యానికి అన్ని విధాలా మేలు చేస్తుందని పెవిలియన్ గ్రౌండ్ వాకర్స్ సభ్యులు ఆదివారం తెలిపారు. ఉదయం నడక ఆరోగ్యానికి అన్ని విధాలా మేలు చేస్తుందని గుండె జబ్బులు, అధిక రక్తపోటు, మధుమేహం వంటి అనారోగ్య సమస్యలను నివారించవచ్చునన్నారు. యోగా, నడక ఎంతో ప్రయోజనకరమన్నారు. నడక వల్ల ఎముకలు, కండరాలు బలోపేతం కావడంతో పాటు బరువు తగ్గడానికి కూడా ఉపయోగపడుతుందన్నారు.నడక అనేది సులభంగా చేయగల వ్యాయామం అన్నారు. ప్రతి ఒక్కరూ ఉదయం, సాయంత్రం నడక సాధన చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో పెవిలియన్ గ్రౌండ్ సీనియర్ నడక సాధకులు మందా వెంకటేశ్వర్లు, శ్రీనివాస్, గంగవరపు వీరభద్రం, పాటి శ్రీనివాస్, రవి, తాళ్లూరి సత్యనారాయణ, వెంకట నారాయణ తదితరులు పాల్గొన్నారు.

## మొక్కల పంపిణీ




**ప్రజాపక్షం/పినపాకః** ప్రతి ఒక్కరూ విధిగా తమ ఇంటిలో పండ్లు, పూల మొక్కలు నాటాలని పినపాక ఎంపీడీవో సునీల్ కుమార్, ఎంపీఓ వెంకటేశ్వరరావు సూచించారు. ఆదివారం పినపాక ఎంపీడీవో ఆదేశాల మేరకు పినపాక మండలం ఈ బయ్యారం గ్రామపంచాయతీ సాయి నగర్ కాలనీలో గ్రామపంచాయతీ సిబ్బంది పండ్లు, పూల మొక్కలు పంపిణీ చేశారు. మునగ మొక్కలు సైతం పెరట్లో నాటాలని పంచాయతీ సిబ్బంది సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## గ్రామపంచాయతీలలో వీధిలైట్ల ఏర్పాటు



**ప్రజాపక్షం/పినపాకః** గ్రామపంచాయతీలలో సెక్రటరీలు వీధిలైట్ల ఏర్పాట్లపై ప్రత్యేక దృష్టి సారించారు. ఆదివారం ఉదయం నుంచి విద్యుత్ శాఖ అధికారుల సహకారంతో పినపాక మండల పరిధిలోని పాత రెడ్డిపాలెం, ఏడూళ్ళ బయ్యారం గ్రామ పంచాయతీలలో వీధిలైట్లు ఏర్పాట్లను చేస్తున్నారు. సమస్య ఉన్న ప్రాంతాలలో వీధిలైట్లోను ఏర్పాటు చేసి, రాత్రి వేళలో ఎటువంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటున్నామని సెక్రటరీలు సాంబశివరావు, జయపాల్ రెడ్డి తెలియజేశారు. ఈ సందర్భంగా సనప శంకర్ స్తంభాలకు వీధి దీపాలు అమరుస్తున్నారని తెలిపారు.

## విద్యుదాఘాతంతో రెండు ఆవులు మృతి



**ప్రజాపక్షం/కామేపల్లి:** మేత కోసం పంట చేల సమీపంలోకి వెళ్లిన రెండు ఆవులు విద్యుత్ ఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందిన సంఘటన ముచ్చర్లలో ఆదివారం చోటు చేసుకుంది. రైతులు బత్తుల ఐలయ్య, బాడిశా మల్లయ్యకు చెందిన దుక్కిటావులు మేతకు వెళ్లిన సమయంలో అప్పటికే తెగి పడి పోయి ఉన్న 11 కెవి విద్యుత్ వైర్లు తగిలి చనిపోయాయి. ఒక్కొక్క ఆవు రూ.80,000విలువల గలవని బాధిత రైతులు కన్నీటి పర్యంతమయ్యారు. విద్యుత్ అధికారులు స్పందించి తమకు న్యాయం చేయాలని కోరారు.

# పోరాట యోధున్ని కోల్పోయాం..




**ప్రజాపక్షం/బూర్గంపాడు:** సిపిఐ అగ్రనేతలో ఒకరు, మాజీ పార్లమెంట్ సభ్యులు సూరవరం సుధాకర్‌రెడ్డి మృతితో భారత జాతీ ఒక పోరాట యోధున్ని కోల్పోయిందని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ముప్వ వెంకటేశ్వరరావు(లడ్డ) ఆవేదన వ్యక్తం చేశారు. ఆదివారం సారపాక సిపిఐ ఆఫీస్‌లో జాతీయ కార్యదర్శి సూరవరం సుధాకర్‌రెడ్డి సంతాప సభ అలవాల సీతారామిరెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. ముందుగా సూరవరం సుధాకర్‌రెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థి దశ నుండి ప్రారంభమైన సుధాకర్‌రెడ్డి పోరాట జీవితం అనేక దశాబ్దాల పాటు ప్రజా ఉద్యమాలకు ప్రేరణగా నిలిచిందన్నారు. విద్యార్థి జీవితంలో పాఠశాల సమస్యలపై మొదలైన ఆయన పోరాట జీవితం తుది వరకు కొనసాగిందన్నారు. విద్యార్థి నాయకునిగా, యువ జన నాయకునిగా అఖిల భారత స్థాయిలో పని చేసిన సూరవరం పార్టీ జాతీయ కార్యదర్శిగా ఎన్నో ప్రజా సమస్యల పరిష్కారానికి పార్టీ విస్తరణకు కృషి చేశారన్నారు. మూడు దశాబ్దాల కాలంలో భారత పార్లమెంట్‌లో రూపుదిద్దుకున్న జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం, సమాచార హక్కు చట్టానికి సంబంధించి డ్రాఫ్ట్ తయారీలో సూరవరం కీలక పాత్ర పోషించారని తెలిపారు. నిరాడంబర జీవితానికి నిలువెత్తు నిదర్శనంగా చెప్పుకునే సుధాకర్‌రెడ్డి గొప్ప మార్క్సిస్టు మోధావి అని, తన కంచు కంఠంతో ప్రజా సమస్యలను వెలుగెత్తి చాటి, పరిష్కారం కోసం పరితపించాడన్నారు. సూరవరం మృతి వామపక్షా ఉద్యమానికి తీరని లోటని ఆయన మృతితో ఓ పేదల గొంతుక ముగబోయిందన్నారు. సూరవరం ఆశయ సాధనకు పునర్ అంకితం రావాలని కార్యకర్తలకు విజ్ఞప్తి చేశారు. సంతాపం తెలిపిన వారిలో సిపిఐ బూర్గంపాడు మండల కార్యదర్శి సబ్కా నాగేశ్వరరావు, సిపిఐ జిల్లా సమితి సభ్యులు పేరాల శ్రీనివాసరావు, మండల సహాయ కార్యదర్శి పాండవుల బిక్షం, సిద్ధార్థ సుబ్బారెడ్డి, ఏఐటియూసి ప్రధాన కార్యదర్శి సింగమనేని ప్రసాద్, అధ్యక్షులు ఎండి సాజిద్, లోకిరెడ్డి శంకర్‌రెడ్డి, దాసరి మలుసూర్, పిచ్చమ్మ, జహీర్, బలరాం, తదితరులు ఉన్నారు.

# సీతారామ ప్రాజెక్ట్‌పై నిర్లక్ష్యం తగదు

**-తెలంగాణ రైతు సంఘం ఆగ్రహం**



**ప్రజాపక్షం/కారేపల్లి:** ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ఏడు లక్షల ఎకరాల సాగు భూములకు నీరు అందించే సీతారామ ప్రాజెక్ట్ పూర్తి చేయడంలో ప్రభుత్వాలు ఇరవై సంవత్సరాల నుండి తీవ్ర నిర్లక్ష్యం చేస్తున్నాయని తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు మండిపడ్డారు. ఆదివారం కారేపల్లి మండలం పాటిమీదిగుంపులో రైతు సదస్సులో ఆయన మాట్లాడుతూ 2000 సంవత్సరం నుండి మూడు వరుస వ్యవసాయ సీజన్‌లో వచ్చిన తీవ్ర వర్షాభావ పరిస్థితుల్లో, ఖమ్మం జిల్లాలో సాగర్ ఆయకట్టు కూడా బీడుగా మారిందన్నారు. ఈపరిస్థితుల్లో ఖమ్మం జిల్లాలో సాగునకు గోదావరి జలాలు తరలింపు మాత్రమే పరిష్కారమని ఖమ్మం పార్లమెంట్ మాజీ సభ్యులు తమ్మినేని వీరభద్రం అన్నారని గుర్తు చేశారు. 2023లో గోదావరి జలాలు సాధన మహాప్రస్థానం పాదయాత్ర కూడా నిర్వహించారని గుర్తు చేశారు. సీతారామ ప్రాజెక్ట్‌ను సత్వరమే పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. లేదంటే, రైతు ఉద్యమం చేస్తామని హెచ్చరించారు. వ్యవసాయ సీజన్ మొదలయ్యేది ముందుకు జరగడం, ఇతర పంటల సాగు తగ్గిపోయి, పత్తి సాగు పెరగటం, కేంద్ర ప్రభుత్వం యూరియా సరఫరాలో కోత పెట్టడంతో తెలంగాణ రాష్ట్రంలో తీవ్ర యూరియా కొరత ఏర్పడిందని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం తెలంగాణ రాష్ట్రంలో ఉన్న రామగుండం యూరియా ఉత్పత్తి పరిశ్రమను నెల రోజుల నుండి ఎదుకు మూసివేశారని, ఇది సహేతుకం కాదని మండిపడ్డారు. తెలంగాణకు వచ్చే యూరియా వాటా రాకుండా చేశారంటున్న రైతుల ఆవేదన అర్థం చేసుకోకుండా, మంత్రులు యూరియా సమస్య రాజకీయ పార్టీల సృష్టి అన్నట్టుగా ప్రకటనలు చేయడం సహేతుకం కాదని విమర్శించారు. ఈకార్యక్రమంలో సీఐటీయూ జిల్లా నాయకులు కే నరేంద్ర, రైతు సంఘం మండల కార్యదర్శి వజ్జా రామారావు, నాయకులు సీతారామయ్య, మాజీ సర్పంచ్ రాంబాయిమ్మ, ధనమ్మ, వెంకన్న, శ్రీనివాసరావు, రవి, వినోద్, తదితరులు పాల్గొన్నారు.

# ఆశ్రమ పాఠశాల సత్తుపల్లికి తరలింపు

**పాఠశాల తరలింపుపై సర్వత్రా ఆక్షేపణ సమస్యలు**




**ప్రజాపక్షం/కల్లూరుః** కల్లూరులోని గిరిజన ఆశ్రమ పాఠశాలను సత్తుపల్లి తరలించేందుకు ఐటిడిఎపిఓ రాహుల్ ఆదేశాలు ఇచ్చినట్లు జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అధికారిని విజయలక్ష్మి తెలిపారు. తరలింపుకు అన్ని సిద్ధం చేస్తున్నట్లు వారు పేర్కొన్నారు. గత 20 సంవత్సరాల క్రితం కల్లూరు లోని ఎన్ఎస్పి ఆవరణలో సబ్ కలెక్టర్ కార్యాలయం సమీపంలో పేద గిరిజన విద్యార్థినిలకు విద్యాబోధన కొరకు గిరిజన ఆశ్రమ పాఠశాలను ప్రారంభించారు. ఆనాడు అన్ని సౌకర్యాలు విద్య బోధన పాఠశాల అన్ని సౌకర్యాలను దానిలోని ప్రారంభించి విద్యా బోధన అందిస్తున్నారు. క్రమేపి బాగానే ఉన్నా ఆగస్టు 4 నుంచి ఆ పాఠశాలలో విద్యార్థులు అస్వస్థత అస్వస్థతకు గురయ్యారు. క్రమేపి మొదటిగా సంక్షేమ అధికారిని సస్పెండ్ చేయగా రెండవసారి వారం రోజుల తర్వాత మళ్లీ అస్వస్థతకు గురికాగా వంట చేసే వారిని బదిలీ చేశారు. సస్పెన్షన్ బదిలీలుకే పరిమితమై పూర్తిస్థాయిలో విచారణ చేయకుండానే మధ్యకాలంలో ఐటీడీఏ పిఓ కల్లూరు సబ్ కలెక్టర్ లు క్షేత్రస్థాయిలో విచారణ చేశారు .అట్టి విచారణలో మౌలిక వసతులు కొరకు 10 లక్షలు మంజూరు చేస్తున్నట్లు ప్రకటించి క్షేత్రస్థాయిలో ఉపాధ్యాయులు విద్యార్థులతో ముఖాముఖి మాట్లాడిన తర్వాత మళ్లీ అకస్మాత్తుగా ఆశ్రమ పాఠశాలను కల్లూరు నుంచి సత్తుపల్లికి తరలించేందుకు ఆదేశాలు ఇవ్వడంపై విద్యార్థుల తల్లిదండ్రులు, కల్లూరు డివిజన్ ప్రజలు, మున్సిపాలిటీ ప్రజలు, విద్యార్థి సంఘాలు రాజకీయ పార్టీలు ప్రజా సంఘాలు ఆక్షేపిస్తూ ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయమై తల్లిదండ్రులు తోపాటు విద్యార్థి సంఘాలు పలు రాజకీయ పార్టీలు ఆందోళనకు సిద్ధమవుతున్నాయి. ఎట్టి పరిస్థితుల్లోనూ గిరిజన ఆశ్రమ పాఠశాల కల్లూరు నుంచి సత్తుపల్లి కి తరలించడానికి ఒప్పుకోమని ప్రజలు అధికారులకు హెచ్చరిస్తున్నారు. ఏది ఏమైనా కల్లూరులో ఉండేటట్టు సాధించుకుంటామని ప్రజల పేర్కొంటున్నారు. ఈ మేరకు ఈ విషయాన్ని ప్రజలకు తెలియడంతో విద్యార్థి సంఘాలు ప్రజా సంఘాలు రాజకీయ పార్టీలు తల్లిదండ్రులు ఆందోళన కార్యక్రమానికి సిద్ధమవుతున్నారు. ఆశ్రమ పాఠశాలకు అన్ని హంగులతో అన్ని సౌకర్యాలు ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చి ఆశ్చర్యపోయేలా ఆదేశాలు ఇవ్వడం ఏమిటని ప్రశ్నిస్తూ ఆందోళనకు సిద్ధమవుతున్నారు.

# సయోధ్య కుదిరేనా?

**- దడవాయి మాయాజాలం !**
**- యజమానికి లక్షల్లో నష్టం ?**
**- ఒరిస్సా నుండి వచ్చిన లేబర్**
**- వ్యతిరేకించిన హమాలి**
**- నాయకుల వద్ద పంచాయితీ ?**
**- కుదరని రాజీ యత్నాలు ?**





(ఫైల్)

**ప్రజాపక్షం/పాల్వంచ :** రేషన్ బియ్యం కొనుగోలును తనకు అనుకూలంగా మార్చుకొన్న ఓ హమాలి ముఠా దడ్‌వాయి అక్రమానికి పాల్పడి ఓ మిల్లులో లక్షలు కొల్లగొట్టాడనే పాల్వంచ వ్యాప్తంగా పుకార్లు షికార్లు చేస్తున్నాయి. గత కొన్ని రోజులుగా పాల్వంచ కేఎస్‌పి రహదారి ఆడమ్స్ ఇంజనీరింగ్ కళాశాల సమీపంలో గల రైస్ మిల్ యాజమానికి, హమాలీల మధ్య వివాదం తీవ్ర స్థాయిలో జరుగుతోంది. ప్రతి రోజు కనీసం 30 మందికి తగ్గకుండా కావలసిన మిల్లు పనికి స్థానికంగా ఉండే హామీలు 15 మంది రావటంతో ఆ మిల్లు యాజమానికి నష్టం వాటిల్లుతోందని దీనితో మిల్లు నిర్వాహకుడు తనకు అవసరమయ్యే 30 మందిని బీహార్ రాష్ట్రం నుండి రప్పించాడు. తమకు ఉపాధి కోల్పోతున్నదంటూ స్థానిక హమాలీలు తీవ్రంగా వ్యతిరేకించారు. దీనితో హమాలీలకు, యాజమానికి మధ్యన పెద్ద మనుషులు రాజీ కుదిర్చారు. ప్రతీ రోజు 30 మంది హమాలీ కార్మికులు మిల్లులో పని చేస్తారని హమాలీలు హామీ ఇచ్చారు. హామీని తుంగలో తొక్కి 30 మంది రాకపోగా అందులో సగం మంది కూడా పనికి రావటం లేదు. వచ్చిన వారిలో సరిగా పని చేయకపోవటం వంటి చర్యలతో రైతులు తీసుకొచ్చిన దాన్యం సైతం తడిసి యాజమానికి నష్టం వాటిల్లితోంది. ఇలా పలు కారణాలతో విసుగెత్తిన మిల్లు నిర్వాహకుడు లేబర్ కమీషన్‌ను ఆశ్రయించాడు. అనంతరం పంచాయితీ పోలీస్ స్టేషన్‌కు చేరుకున్నది. దీనితో రంగంలోకి దిగిన హమాలి అనుబంద యూనియన్ నాయకులు మిల్లు యాజమాని, హమాలీలకు మధ్యన రాజీ కుదిర్చేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. అయినా వారి ప్రయత్నాలు సఫలం కాలేదని తెలుస్తోంది.

### దడవాయి మాయాజాలం...

గత కొంత కాలం క్రితం పాల్వంచలో రేషన్ బియ్యం దందా జోరుగా సాగేది. ఈ క్రమంలో పలు గ్రామాల నుండి కొందరు వ్యక్తులు ఆటోలు, మోపెడ్ బైక్‌లు ద్వారా రేషన్ బియ్యాన్ని విక్రయించేందుకు మిల్లుకు వచ్చేవారు. ఆ సమయంలో మిల్లు యాజమాని ఉంటే తూకం వేసి దానికి తగ్గట్టుగా పైసలు చెల్లించేవాడు. ఒకవేళ యాజమాని లేని సమయంలో బియ్యం తీసుకొస్తే అక్కడ పని చేసిన హమాలీ దడువాయి బియ్యాన్ని తూకం వేసి ఓచిట్టీ రాసిచ్చేవాడు. ఆ చిట్టిని పట్టుకొచ్చి మిల్లు యాజమానికి చూపెడితే డబ్బులు చెల్లించేవాడు. ఇదే అదనుగా భావించిన హమాలి దడ్‌వాయి, రేషన్ బియ్యం తీసుకొచ్చిన వారితో కుమ్మక్కయ్యాడు. తరువాత హమాలీ దడ్‌వాయి తన చేతవాటం ప్రదర్శిస్తూ మాయాజాలానికి తెరలేపాడు. ఉదాహరణకు ఒకరు 100 కిలోల బియ్యం తీసుకొస్తే అదనంగా 50 కేజీలు కలిపి 150 కిలోలు తీసుకొచ్చారని చీటీ రాసిచ్చేవాడు. ఇలా కొంత కాలం సజావుగా జరిగింది. అదనపు బియ్యానికి వచ్చిన డబ్బులను హమాలీ దడ్‌వాయి తీసుకొని కొంత నగదును బియ్యం తీసుకొచ్చిన వారికి ఇచ్చేవాడని పుకార్లు. ఇలా కొన్ని నెలల పాటు సాగిన దడ్‌వాయి మాయాజాలంపై మిల్లు యాజమానికి అనుమానం కలిగింది. వచ్చిన బియ్యం తక్కువగా చెల్లించే డబ్బులు ఎక్కువగా ఉంటున్నాయని పసిగట్టాడు. సిసి పుటేజీలను పరిశీలించుకొన్నాడు. అవకతవకలు జరినట్లు దీనితో సుమారు 8 లక్షల నష్టం వచ్చినట్లు అంచనాకు వచ్చారు. ఇది మనసులో పెట్టుకొని హమాలీల పట్ల కోపం పెంచుకొని పని చేస్తలేరని నష్టం జరుగుతుందనే నెపంతో ఇక్కడి హమాలీలు సరిగా పని చేయటం లేదని కారణంతో ఒరిస్సా నుండి లేబర్‌ను తీసుకొచ్చారని ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. హమాలీ దడ్‌వాయి కారణంగా తనకు జరిగిన నష్టాన్ని చెల్లించాలని మిల్లు నిర్వాహకుడు ప్రస్తుతం పనిచేస్తున్న హమాలీలను అడిగారని, దీనితో అన్యాయానికి పాల్పడిన ఒకవ్యక్తి చేసిన తప్పుకు మేమెందుకు చెల్లిస్తామని హమాలీలు తిరస్కరించారని తెలుస్తోంది. పాల్వంచ చరిత్రలో హమాలీలు ఎప్పుడూ తప్పుడు పనులకు పాల్పడలేదని, ఈ దడ్‌వాయి తీరు హమాలీ చరిత్రలో మాయని మచ్చలా మారిందని పలువురు చర్చించుకోవటం గమనార్హం.

### ఫిర్యాదుకు వెనకడుగు...

హమాలీ దడ్‌వాయి చేసిన మోసంతో జరిగిన నష్టాన్ని గుర్తించిన సదరు మిల్లు యాజమాని పోలీసులకు ఫిర్యాదు చేసే విషయంలో వెనకడుగు వేస్తున్నారని తెలుస్తోంది. ఫిర్యాదు చేసే క్రమంలో తాను చేసిన తప్పు రేషన్ బియ్యం కొనుగోలు వ్యవహారం బయట పడి తనపై కూడా కేసు నమోదవుతుందనే కారణంతో మింగలేక కక్కలేక సతమతమవుతున్నాడని పలువురు గుస గుసలాడుకోవటం గమనార్హం.

### - ఫిర్యాదు రాలేదు...

ఈ విషయంపై పాల్వంచ పట్టణ పోలీస్ స్టేషన్ ఎస్ఐ సుమన్‌ను కోరగా : ఇంత వరకు అలాంటి ఫిర్యాదు అందలేదని చెప్పారు. మిల్లులో 30 మంది కూలీల విషయంపై ఫిర్యాదు చేశారని అన్నారు.

# క్రీడా ప్రాంగణం గేట్ తెరిపించాలి

**ఇబ్బందులు పడుతున్న క్రీడాకారులు**




**ప్రజాపక్షం/చింతకాని :** గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సహించాలన్న ఉద్దేశ్యంతో గత ప్రభుత్వం ప్రతి గ్రామంలో క్రాడీ ప్రాంగణాలను ఏర్పాటు చేసింది. అవి కొన్ని గ్రామానికి దూరంగా ఉండటం మరికొన్ని గ్రామల్లో స్థలాల్లో పాఠశాల ఆవరణల్లో నిర్మించారు. పాఠశాలల్లో ఏర్పాటు చేసిన గ్రామీణ క్రీడా ప్రాంగణాల్లో క్రీడాకారులు ఆదివారం వచ్చిందంటే చాలు ఆటల్లో మునిగి తెలుతుంటారు. చింతకాని మండలం కొదుమూరు క్రీడా ప్రాంగణం సెలవు దినాల్లో చుట్టు ప్రక్కన ఏడు గ్రామల యువకులతో కోలాహలంగా మారుతుంది. గత రెండు నెలల క్రితం హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు బదిలీ కావడం నూతన ప్రధానోపాధ్యాయుడు రావడం క్రీడాకారులకు శాపంగా మారింది. సెలవు దినాల్లో పాఠశాల గేటు తాళం తీయవద్దని వాచ్‌మెన్ కు హుకుం జారీ చేశారు. దీంతో క్రీడా ప్రాంగణానికి వచ్చిన క్రీడాకారులకు నిరాశ ఎదురవుతంది. కొంత మంది గేటు దూరి ఆటలాడుకుంటునప్పటికీ గేటు ఎక్కే క్రమంలో గాయాలసపాలవుతున్నారు. దీంతో క్రీడాకారులు పంచాయతీ కార్యదర్శికి సమస్యను వివరించినప్పటికీ సమస్య పరిష్కారం కావడం లేదని క్రీడాకారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఆదివారం క్రీడాకారులు ఉమర్‌పాషా, రాంబాబు, సింగారపు కోటి, పయ్యావుల అశోక్, మురళీ, హరీష్, నాగరాజు, సేలం రమేష్, అమర్లపుడి అశోక్, కొత్త శేషుబాబు క్రీడా ప్రాంగణం గేటు తెరవాలని ఆందోళన నిర్వహించారు.

### క్రీడా ప్రాంగణం తెరిచి ఉంచాలి : అబ్బూరి మహేష్ (సీపీఐ మండల సహాయ కార్యదర్శి)

పల్లెల్లో ప్రభుత్వ స్థలాలు లేక పాఠశాల ఆవరణలో క్రీడా కారులు కోసం ప్రభుత్వం క్రీడా ప్రాంగణాలు ఏర్పాటు చేసింది. ప్రధానోపాధ్యాయులు పాఠశాల గేటు వేయటం సరికాదు. సెలవు దినాల్లో పాఠశాల గేటు తెరిచి ఉంచాలి లేని పక్షంలో పెద్ద ఎత్తున ఉద్యమిస్తాం.

## మంత్రి పొన్నం ప్రభాకర్‌ని కలిసిన మహంకాళి



**ప్రజాపక్షం/బూర్గంపాడు:** రాష్ట్ర రోడ్డు, రవాణా, బిసి సామాజిక వర్గ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌ని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బీసీ సంఘం అధ్యక్షులు మహంకాళి రామారావు హైదరాబాద్‌లో జూబ్లీహిల్స్‌లో గల తన స్వగృహం నందు మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం పుష్పగుచ్ఛంతో సత్కరించి, భద్రాచలంలో కొలువున్న భద్రాద్రి రామయ్య ప్రసాదం, అక్షింతలు అందజేశారు. ఈ క్రమంలో రాష్ట్ర ప్రభుత్వం బిసిలకు నిర్ణయించిన 42శాతం రిజర్వేషన్లపై చర్చించారు. బిసిల రిజర్వేషన్ల సాధనకై బిసి మంత్రులు పోరాది సాధించాలని కోరారు. ఈకార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు టి ఆర్ చందర్, విద్యార్థి సంఘం అధ్యక్షులు బండారు రాజు, ఉపాధ్యక్షులు చిప్పారాజు, బిసి సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## సబార్డినేట్ సమితి అధ్యక్షునిగా విజయ్



**ప్రజాపక్షం/చంద్రుగొండ:** నాలుగో తరగతి ఉద్యోగుల సమితి అధ్యక్షులుగా ఎర్రగుంట జిల్లా పరిషత్ పాఠశాల సబార్డినేట్‌గా పని చేస్తున్న విజయ్ కుమార్ నియమితులయ్యారు. ఆదివారం నాలుగో తరగతి ఉద్యోగుల ముఖ్య సర్వ సభ్య సమావేశంలో జిల్లా అధ్యక్షులు పులికంటి వెంకటేశ్వర్లు అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. చంద్రుగొండ, అన్నపురెడ్డిపల్లి, సుజాత నగర్ మండలాల సమితి సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా సమితి అధ్యక్షుడిగా కె విజయ్ కుమార్ అసోసియేషన్ అధ్యక్షులుగా రామకృష్ణ, ప్రధాన కార్యదర్శిగా కరుణాకర్, కోశాధికారిగా జమలయ్య, అదే విధంగా మహిళ అధ్యక్షురాలుగా చంద్రుగొండ ఎంపీపీ కార్యాలయంలో సబార్డినేట్‌గా పని చేస్తున్న భూక్య లక్ష్మిని నియమించారు. అదే విధంగా కమిటీ సభ్యులను కూడా ఎన్నుకున్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ తోటి ఉద్యోగులందరికి సమస్యలపై పోరాడుతామని అన్నారు. మా సమస్యలు పరిష్కరించే విధంగా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లే విధంగా కృషి చేస్తానని అన్నారు. ఈకార్యక్రమంలో ఆ సంఘం నాయకులు లక్ష్మి నరసు, శేషమ్మ, మైబూబి తదితరులు పాల్గొన్నారు.

## సమ్మె హామీలు అమలు చేయకపోతే మరో ఉద్యమం

**ప్రజాపక్షం/కారేపల్లి:** సమగ్ర శిక్షా ఉద్యోగులకు ప్రభుత్వం ఇచ్చిన సమ్మె హామీలు అమలు చేయకపోతే మరో ఉద్యమేనని సమగ్ర శిక్ష ఉద్యోగుల సంఘం జిల్లా కమిటీ సభ్యులు లకావత్ రాములు అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో ఆయన మాట్లాడుతూ సమగ్ర శిక్ష ఉద్యోగులు తమ సంవత్సరం 10 డిసెంబర్ 2024 నుండి సమ్మె చేసిన సందర్భంగా ప్రభుత్వం 6 జనవరి 2025న డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క సమక్షంలో చర్చలు జరిపి నాన్ ఫైనాన్షియల్ అంశాలు రెండు నెలల్లో అమలు చేస్తామని చెప్పి 6 నెలలు అవుతుందన్నారు. ఇప్పటి వరకు అమలు చేయకపోవడం, విధి నిర్వహణలో ఇప్పటికే రాష్ట్ర వ్యాప్తంగా 175 మంది వరకు చనిపోయిన వారి కుటుంబాలకు ఆర్థిక భరోసా లేకపోవడంతో వారి కుటుంబాలు రోడ్డున పడ్డాయన్నారు. ప్రజా ప్రభుత్వం అని నమ్మకంతో రెండు సంవత్సరాలు వేచి చూసినా ఇప్పటికి మాకు ఎటువంటి న్యాయం చేయలేదని, ప్రభుత్వం వెంటనే సమ్మె హామీలు అమలు చేయకపోతే మరో తెలంగాణ ఉద్యమం ప్రారంభం అయిన ఖమ్మం జిల్లా నుండి మొదలు పెడతామని, ఇకనైనా ప్రభుత్వం స్పందించి మాకు న్యాయం చేయాలన్నారు.

## సురవరం పార్థీవదేహానికి నివాళులు



**ప్రజాపక్షం/ఇల్లందుః** సిపిఐ మాజీ కేంద్ర కార్యదర్శి, మాజీ ఎంపీ సురవరం సుధాకర్ రెడ్డి పార్థీవదేహాన్ని హైదరాబాద్‌లోని మగ్దూం భవన్‌లో ఆదివారం సిపిఐ జిల్లా కమిటీ సభ్యుడు దేవరకొండ శంకర్, జిల్లా నాయకులు మంచాల వెంకటేశ్వర్లు పార్థీవ దేహాన్ని సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సురవరం సుధాకర్ రెడ్డి మృతి సిపిఐ పార్టీకి తీరని లోటని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు గుగులోతు కృష్ణ, దాసు, అనిల్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## నేటి ధర్నాను జయప్రదం చేయండి



**ప్రజాపక్షం/ బోనకల్ :** రైతులకు సకాలంలో యూరియా అందించాలని డిమాండ్ చేస్తూ 25న మండల కేంద్రంలో నిర్వహించనున్న ధర్నాను జయప్రదం చేయాలని మండల రైతు సంఘం అధ్యక్షులు కొంగర భాస్కర్‌రావు, మండల ప్రధాన కార్యదర్శి ఏలూరి పూర్ణచంద్రరావు పిలుపునిచ్చారు. పలు పంటలు సాగు ముమ్మరంగా కొనసాగుతున్న సమయంలో యూరియా కొరత వల్ల రైతులు అనేక ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. యూరియ సరఫరా చేయటంలో కేంద్ర ప్రభుత్వ వైఫల్యాన్ని నిరసిస్తూ జరుగనున్న రైతులు అధికసంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

# రైస్‌మిల్ నిర్వాహకుడి రాయభారం..!



**-బాధితులతో మంతనాలు**
**-ఫిర్యాదు చేయకండి..**
**మీ అవసరాలు తీరుస్తా అని వేడుకోలు**

**ప్రజాపక్షం/ఖమ్మంరూరల్:** ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలోని వరంగల్ క్రాస్‌రోడ్‌లో గల ఓ రైస్‌మిల్‌పై ప్రజాపక్షం వరుస కథనాలు ప్రచురిస్తున్న విషయం పాఠకులకు విధితమే..ఆ రైస్‌మిల్‌తో పరిసర ప్రాంతాల నిర్వాసితులు పడుతున్న సమస్యలపై వారి గొంతుకగా అక్షరమే ఆయుధంగా అండగా నిలబడింది. ఈ నేపథ్యంలో రైస్‌మిల్ సాక్షిగా సాగుతున్న అవకతవకలను వెలుగులోకి తీసుకువచ్చింది. ఇవి ప్రజలలో తీవ్ర చర్చనీయాంశంగా మారాయి. దీంతో సదరు రైస్‌మిల్ నిర్వాహకుడు కట్టు కథలుగా చిత్రీకరించేందుకు పావులు కదిపాడు. ఇందుకోసం కొందరు రాజకీయ బ్రోకర్లతో నిర్వాసితుల సమస్యను పక్కదారిపట్టించేలా? ఆరోపణలకు తెరలేపాడు. ఇవి ప్రజాక్షేత్రంలో ఆధారాలతో సహా నిరూపితమవ్వడంతో కుట్ర బెడిసికొట్టింది. నానాటికి ఇటు ప్రజలలో అటు అధికారులలో పలుచనవుతుండటంతో కొత్త పథకాన్ని రచించాడు. ఈ సారి ఏకంగా నిర్వాసితుడిని తన రైస్‌మిల్లులోకి పిలిపించుకొని తనకు సపోర్టుగా ఉండాలని బుజ్జగించాడు. రైస్‌మిల్‌తోటి సమస్య అవాస్తవమని, ప్రెస్‌మీట్ పెడతాను మీరంతా నాకు అండగా నిలవాలని కోరాడు. అనారోగ్య సమస్యలు ఉంటే వైద్యానికి డబ్బులు సైతం ఇస్తానని డబ్బు ఆశ చూపే ప్రయత్నం చేశాడు. అంతేకాకుండా ఇక రైస్‌మిల్ సమస్య ఉండదని ఫంక్షన్‌హాల్ కట్టుకుంటున్నానని, మీకు అండగా ఉంటానని తీయ్యని మాటలు వల్లే వేయసాగాడు. దీనిపై సదరు నిర్వాసితుడు సమస్య ఉందని పత్రిక దృష్టికి తామే చెప్పామని బదులిచ్చాడు. ఇప్పుడు సమస్య లేదని తామేలా? చెబుతామంటూ.. ఎదురు ప్రశ్నించడంతో ఆలోచించుకోమని చెప్పినట్టు తెలిసింది.

### కొసమెరుపు...

సదరు రైస్‌మిల్ ద్వారా నిర్వాసితులకు ఎటువంటి సమస్య లేదు. వాణిజ్య పన్నుకు బదులు నివాస పన్ను కడుతుండటం తప్పుడు ఆరోపణ. అసలు తన రైస్‌మిల్ మూడు నెలల నుండి నడవడం లేదు. 30సంవత్సరాలుగా లేని సమస్య ఇప్పుడే ఎందుకు?. ఇవన్నీ సదరు రైస్‌మిల్ నిర్వాహకుడు చేసుకుంటున్న ప్రచారం..మరి అలాంటప్పుడు వార్తలు అవాస్తవమని చెప్పాలని నిర్వాసితుడిని పిలిచి రాయబేరాలు చేయాల్సిన అవసరమైతే లేదు. ఈ తీరును బట్టి రైస్‌మిల్ నిర్వాహకుడి వ్యవహారం ఏమిటనేది ప్రజలకు ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదని స్పష్టం అవుతుంది.

# సునంద సాహిత్య సేవ అద్వీయతం

**-ఘనంగా పురిమళ్ల ఫౌండేషన్ వార్షికోత్సవం**





**ప్రజాపక్షం/ ఖమ్మం :** పురిమళ్ల సునంద చేస్తున్న సాహిత్య సేవ అభినందనీయమని వర్ధమన రచయితలు, బాల కవులను ప్రోత్సహించడం గర్వించదగిన విషయమని ప్రముఖ విద్యావేత్త మువ్వా శ్రీనివాసరావు తెలిపారు. పురిమళ్ల ఫౌండేషన్ ఏడవ వార్షికోత్సవం స్థానిక మంచి కంటి భవన్‌లో ఆదివారం జరిగింది. నామ పురుషోత్తం అధ్యక్షతన జరిగిన సభలో మువ్వా శ్రీనివాసరావు మాట్లాడుతూ ఏడేళ్లుగా సాహిత్య రంగంలో వివిధ సేవలు అందిస్తున్నారని ఆయన తెలిపారు. రానున్న కాలంలో సాహిత్య అభివృద్ధికి పురిమళ్ల ఫౌండేషన్ మరింత కృషి చేయాలని శ్రీనివాసరావు ఆకాంక్షించారు. ఏడవ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని బోగోజు సముద్రమ్మ, పురుషోత్తం స్మారక పురస్కారాన్ని ప్రముఖ రచయిత మాల్యశ్రీకి అందించారు. వార్షికోత్సవం సందర్భంగా నిర్వహించిన పోటీలలో విజేతలకు పురస్కారాలు అందజేసి సన్మానించారు. ఈ కార్యక్రమంలో ప్రమఖ కవులు రవిమారుత్, ఆనందచారి, కృష్ణమూర్తి, అక్షరాల తోవ నిర్వాహకులు దాసరోజు శ్రవణ్, కవయిత్రి తాళ్లూరి లక్ష్మి, కవులు దేవేంద్ర, కె. వెంకటయ్య, సయ్యద్ షఫీ, అయినాల సైదులు, మేడగాని శేషగిరి తదితరులు పాల్గొన్నారు.

# భార్యపై మారణాయుధంతో దాడి చేసిన భర్త

**- తీవ్ర రక్తస్రావంతో అపస్మారక స్థితిలోకి బాధితురాలు**
**- హుటాహుటిన ఆసుపత్రికి తరలించిన స్థానికులు**
**- సంఘటన స్థలానికి చేరుకుని**
**విచారణ చేపట్టిన రూరల్ ఎస్సై**





**ప్రజాపక్షం/ మధిర :** కుటుంబ కలహాల నేపథ్యంలో భార్యపై ఆగ్రహానికి గురైన భర్త మారణాయుధంతో ఆమెపై దాడి చేసి తీవ్రంగా గాయపరిచిన సంఘటన మండల పరిధిలోని మాటూరు గ్రామం బిసికాలనీలో జరిగింది. శనివారం అర్ధరాత్రి జరిగిన సంఘటన సంబంధించి వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన చిల్ల సూర్యనారాయణ ప్రైవేట్ లారీ డ్రైవర్‌గా పనిచేస్తూ జీవన సాగిస్తున్నాడు. అరకొర ఆర్థిక సమస్యలు కుటుంబ భారంతో భార్యాభర్తల మధ్య నెలకొన్న మనస్పర్ధల నేపథ్యంలో శనివారం డ్రైవర్ విధులకు వెళ్లి తిరిగి ఇంటికి వచ్చిన భర్త సూర్యనారాయణ(32) భార్య సాయి నాగలక్ష్మి(26)తో చిన్న సమస్యపై ఘర్షణపడ్డారు. ఈ క్రమంలో తీవ్ర ఆగ్రహానికి గురైన సూర్యనారాయణ అందుబాటులో ఉన్న మారణాయుధంగా ఉన్నట్లు గుర్తించిన వస్తువుతో భార్యపై దాడికి దిగినట్లు, ఈ దాడిలో నాగలక్ష్మి మెడపై బలమైన ఘాట్లు పడి రక్తస్రావం కావడంతో బాధితురాలు కేకలు వేసుకుంటూ ఇంట్లో నుండి రోడ్డుపైకి వచ్చి కింద పడిపోవడంతో బయటికి వచ్చిన స్థానికులు 108 అంబులెన్స్ సహాయంతో ఆమెను హుటాహుటిన ఆసుపత్రికి తరలించారు. నాగలక్ష్మి పై మెడపై బలమైన గాయంతో తీవ్ర రక్తస్రావం కావడంతో ఆమె పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం. సంఘటన జరిగిన సమాచారాన్ని తెలుసుకున్న రూరల్ ఎస్సై లక్ష్మి భార్గవి సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకుని విచారణ నిర్వహించారు. స్థానికులతో ఆదివారం ఉదయం మరోసారి పరిశీలన సందర్భంగా విచారణ నిర్వహించి నిందితునిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు. సూర్యనారాయణ దంపతులకు ఇద్దరు మగ పిల్లలు ఉండగా ప్రస్తుతం నాగలక్ష్మి గర్భవతిగా ఉన్నట్లు సమాచారం. బాధితురాలు అమాయకురాలుగా అణుకువగా ఉంటుందని, సూర్యనారాయణ ఆమెపై గతంలో కూడా దాడి చేసి కొట్టినట్లు సమాచారం. అనంతరం గ్రామంలో ఈ సంఘటనపై పలు విధాలుగా చర్చించుకోవడం గమనార్హం.

## వెలగపూడి కుటుంబానికి తుమ్మల పరామర్శ



**ప్రజాపక్షం/ మధిర రూరల్ :** సీనియర్ నాయకులు, మాజీ మార్క్‌ఫెడ్ చైర్మన్ వెలగపూడి శివరాంప్రసాద్ ఇటీవల మృతి చెందిన విషయం విధితమే. ఆదివారం ఆయన స్వగ్రామమైన సిరిపురంలోని ఆయన కుటుంబాన్ని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పరామర్శించారు. ముందుగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ తన రాజకీయ జీవితంతో తన వెంట ప్రధానంగా నడిచిన వ్యక్తిగా వెలగపూడి శివరాంప్రసాద్ చేసిన సేవలను కొనియాడారు. శివరాంప్రసాద్ మృతి వారి అనుచరులకు తీరని లోటని అన్నారు. కార్యక్రమంలో డిసిసిబి చైర్మన్ దొండపాటి వెంకటేశ్వరరావు, టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షులు డాక్టర్ వాసిరెడ్డి రామనాధం, జిల్లా కాంగ్రెస్ నాయకులు మొండితోక సుధాకర్, చెరుకూరి నాగార్జున పాల్గొన్నారు.

## సన్‌రైజ్ సేవలు ప్రశంసనీయం



**ప్రజాపక్షం/ రఘునాథపాలెం :** సన్‌రైజ్ అభ్యుదయ సేవా సంస్థ చేపడుతున్న సేవలు ప్రశంసనీయమని తల్లాడ ఎంపిడివో ఏనుగు సురేష్‌బాబు తెలిపారు. సన్‌రైజ్ ఆధ్వర్యంలో రఘునాథపాలెం మండల పరిధిలోని చింతగుర్తిలో అంగన్‌వాడీ కేంద్రానికి కుర్చీలు, ఫ్యాన్, కుక్కర్, ర్యాక్, వాటర్ క్యాన్ తదితర రూ. 15వేల విలువైన వస్తువులను అందించారు. ఏనుగు కిరణ్‌బాబు జన్మదిన సందర్భంగా ఈ వితరణ చేసినట్లు సన్‌రైజ్ సంస్థ తెలిపింది. ఈ కార్యక్రమానికి హాజరైన సురేష్ బాబు మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాలు విద్యా సంస్థల్లో మౌలిక వసతుల కల్పన ప్రధానమైందని ఆ విషయంలో ఇతోదిక సేవలు అందిస్తున్న సన్‌రైజ్ సంస్థ సేవలు అభినందనీయమన్నారు. భవిష్యత్తులో కూడా మరిన్ని సేవలను అందించాలని ఆయన ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు మాలతి దాస్, సంస్థ ప్రతినిధులు, అంగన్ వాడీ టీచర్ కవిత, ఆయా తదితరులు పాల్గొన్నారు.

## అమర్ రహే నినాదాల మధ్య సురవరానికి అంతిమ వీడ్కోలు

**ప్రజాపక్షం/ ఖమ్మం :** భారత కమ్యూనిస్టు పార్టీ అగ్రనేతల్లో ఒకరు మాజీ జాతీయ ప్రధాన కార్యదర్శి, మాజీ పార్లమెంట్ సభ్యులు సురవరం సుధాకర్‌రెడ్డి అంతియ యాత్ర ఆదివారం జరిగింది. అమర్ హై నినాదాల మధ్య సురవరం పార్థివ దేహన్ని కుటుంబ సభ్యుల సమక్షంలో పార్టీ నేతలు గాంధీ ఆసుపత్రికి అప్పగించారు. అంతకు ముందు మగ్దూం భవన్‌లో వేలాది మంది సురవరం మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులు, వివిధ పార్టీల నేతలు నివాళులర్పించిన వారిలో ఉన్నారు. మగ్దూం భవన్ నుంచి వేలాది మందితో అంతిమ యాత్ర ప్రారంభమైంది. కమ్యూనిస్టు పార్టీ కార్యకర్తల అమర్ రహే నినాదాలు, రెడ్ షర్ట్ వాలంటీర్ల కవాతు నడుమ అధికార లాంఛనాలతో సాగింది. ఉమ్మడి ఖమ్మంజిల్లా వ్యాప్తంగా సురవరం సుధాకర్‌రెడ్డి సంతాప సభను నిర్వహించి నివాళులర్పించారు. జిల్లా కేంద్రాలతో పాటు మండల కేంద్రాలు, ఉద్యమ గ్రామాల్లో ఆయనకు నివాళులర్పించి సంతాప సభలు నిర్వహించారు.

## రాజ్యాంగంపై అవగాహన



**ప్రజాపక్షం/ బోనకల్ :** రాజ్యాంగ విద్య ప్రజలకు అందిస్తే కొందరికి ప్రమోదంగా ఇంకొందరికి ప్రమాదంగా ఉంటుందని పల్లె ప్రపంచ ఫౌండేషన్ అధ్యక్షులు పల్లా కొండలరావు తెలిపారు. ఆదివారం బోనకల్ సిపిఎం కార్యాలయంలో జరిగిన స్టడి సర్కిల్‌లో రాజ్యాంగ అధ్యయనం ఎవరికి ప్రమోదం, ఎవరికి ప్రమాదం అనే అంశంపై మాట్లాడారు. ప్రకృతి విధ్వంసం లేని అందరికి సమాన అవకాశాలు కల్పించే అభివృద్ధిని కోరుకునేవారు రాజ్యాంగాన్ని పరిరక్షించాలని పోరాడుతున్నారన్నారు. పౌరులకు హక్కులతో పాటు విధులను, బాధ్యతలపై అవగాహన కల్పిస్తే చైతన్యం పెరిగి మెరుగైన సమాజ నిర్మాణం జరుగుతుందన్నారు. అన్నివర్గాల ప్రజలు రాజ్యాంగంపై అవగాహన పెంచుకుని రాజ్యంగ విలువలను కాపాడుకోకపోతే దేశ మనుగడ ప్రమాదంలో పడుతుందన్నారు. ప్రజాస్వామ్యం మెరుగు పడాలంటే ఓటు విలువను ప్రచారం చేయాలని ఎన్నికల సంఘం స్వతంత్రంగా రాజ్యంగ బద్ధంగా వ్యవహరించాలన్నారు. రాజ్యాంగ మౌళిక స్వరూపం మార్చే, ప్రాథమిక హక్కులకు భంగం వాటిల్లే కుట్రపూరిత చట్టాలను తెచ్చే ప్రయత్నాలను ప్రజాస్వామికవాదులు ప్రజల మద్దతుతో పోరాటాల ద్వారా తిప్పి కొట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో స్టడీ సర్కిల్ కన్వీనర్ తెల్లాకుల శ్రీనివాసరావు, చింతలచెర్వు కోటేశ్వరరావు, దొండపాటి నాగేశ్వరరావు, కిలారు సురేష్, బంధం శ్రీనివాసరావు, జొన్నలగడ్డ సునీత, ఎరగాని కృష్ణవేణి, చలుమల హరికిషన్‌రావు, బొప్పాల రమేష్, గండు సైదులు, ఉప్పరశ్రీను పాల్గొన్నారు.

## సందడిగా మారిన పెద్దమ్మతల్లి దేవాలయం



**ప్రజాపక్షం/పాల్వంచ :** మండల పరిధి కేశవాపురం, జగన్నాధపురం గ్రామాల మద్యన కొలువై ఉన్న ( శ్రీ కనకదుర్గ ) పెద్దమ్మతల్లి దేవాలయం ఆదివారం అధిక సంఖ్యలో వచ్చిన భక్తులతో సందడిగా మారింది. భక్తుల అమ్మవారికి బోనాలు సమర్పించారు. ఒడిబియ్యం, చీరలు, కనుములు తదితర మొక్కులు చెల్లించుకొన్నారు. అదే విధంగా ఆలయ ఆవరణంలో గల శ్రీ అన్నపూర్ణా సమేత కాశీ విశ్వేశ్వరస్వామి ఆలయంలో స్వామి వారికి అభిషేకములు నిర్వహించారు. క్యూలైన్‌లో భక్తులకు మంచినీటి వసతి, ఉచిత పులిహోర ప్రసాద వితరణ చేశారు.


# సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యునిగా బాగం



**-కంట్రోల్ కమిషన్ ఛైర్మన్‌గా మహ్మద్ మౌలానా**
**-కార్యవర్గ సభ్యులు దండి సురేష్, జితేందర్‌రెడ్డి**

**ప్రజాపక్షం/ ఖమ్మం :** భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) తెలంగాణ రాష్ట్ర సమితి కార్యదర్శివర్గ సభ్యునిగా జిల్లాకు చెందిన బాగం హేమంతరావు ఎన్నికయ్యారు. మూడు రోజుల పాటు మేడ్చల్ జిల్లా గాజుల రామవరంలో జరిగిన తెలంగాణ రాష్ట్ర నాల్గవ మహాసభలో ఈ ఎన్నిక జరిగింది. నేలకొండపల్లి మండలం మూటాపురంలో రైతు కుటుంబంలో జన్మించిన బాగం హేమంతరావు విద్యార్థి ఉద్యమంలో పని చేశారు. ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి ఏఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షునిగా పనిచేసిన ఆయన సుదీర్ఘకాలం ఉమ్మడి ఖమ్మంజిల్లా కార్యదర్శిగా విభజన అనంతరం అవశేష ఖమ్మం జిల్లా కార్యదర్శిగా, డిసిసిబి ఉపాధ్యక్షులుగా పని చేశారు. మూటాపురం పిఎసిఎస్ అధ్యక్షునిగా పనిచేస్తున్న బాగం హేమంతరావు రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షునిగా, సిపిఐ జాతీయ సభ్యునిగా కొనసాగుతూ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యునిగా ఎన్నికయ్యారు. ఖమ్మం రూరల్ మండలం ముత్తగూడెం గ్రామానికి చెందిన మహ్మద్ మౌలానా అత్యంత కీలకమైన సిపిఐ రాష్ట్ర కంట్రోల్ కమిటీ ఛైర్మన్‌గా ఎన్నికయ్యారు. సీనియర్ కమ్యూనిస్టుగా జిల్లాకు చిర పరిచితులైన మౌలానా ఛైర్మన్‌గా ఎన్నిక కావడం ఇంది రెండోసారి. సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్, సహాయ కార్యదర్శి జమ్ముల జితేందర్‌రెడ్డి రాష్ట్ర కార్యవర్గ సభ్యులుగా ఎన్నికయ్యారు. రాష్ట్ర సమితి సభ్యులుగా యర్రాబాబు, ఏపూరి లతాదేవి, ఎస్‌కె జానిమియా, కొండపర్తి గోవిందరావు, సిద్దినేని కర్ణకుమార్, ఆహ్వానితులుగా అజ్మీర రామ్మూర్తి, మహ్మద్ సలాం, బిజి క్లెమెంట్ లు ఎన్నికయ్యారు.

# సిపిఐ రాష్ట్ర కమిటీలో జిల్లాకు సముచిత స్థానం






**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం** భారతకమ్యూనిస్టు పార్టీ సిపిఐ రాష్ట్ర కమిటీలో జిల్లాకు సముచిత స్థానం దక్కింది. రాష్ట్ర కార్యదర్శిగా కొత్తగూడెం శాసన సభ్యులు కూనంనేని సాంబశిరావు ఎన్నిక మరోసారి ఏకగ్రీవమైంది. రాష్ట్ర కార్యవర్గసభ్యులుగా భద్రాద్రి కొత్తగూడె జిల్లా కార్యదర్శి ఎస్‌కే సాబీర్ పాషా, ముత్యాల విశ్వనాధం, కల్లూరి వెంకటేశ్వరరావు ఎన్నికయ్యారు. అదే విధంగా రాష్ట్ర సమితిలో జిల్లాకు చెందిన కే సారయ్య, మున్నా లక్ష్మీ కుమారి, నరాటి ప్రసాద్, సరెడ్డి పుల్లారెడ్డి, వై ఉదయ్ భాస్కర్, ఎస్‌డి సలీం, రావులపల్లి రవికుమార్, సలిగంటి శ్రీనివాస్, చంద్ర నరేంద్రకుమార్‌లకు చోటు దక్కింది. సింగరేణి యూనియన్ నాయకులు మిర్యాల రంగయ్య రా ష్ట్ర కంట్రోల్ కమీషన్ సభ్యులుగా ఎన్నికయ్యారు.ఈనెల 20,21,22 తేదీల్లో మేడ్చల్ జిల్లాలోని గాజుల రామవరంలో జరిగిన సిపిఐ రాష్ట్ర 4వ మహాసభల్లో ఈ కమిటీ ఎన్నిక చోటు చేసుకుంది.

# ఉపాధిహామి చట్టం చేయడంలో సుధాకర్‌రెడ్డి పాత్ర మరువలేనిది

**సిపిఐ మండల కార్యదర్శి గడల భాస్కర్‌రావు**



**ప్రజాపక్షం/కొణిజర్ల :** జాతీయ ఉపాధిహామి పథకాన్ని పార్లమెంట్‌లో ప్రవేశపెట్టి చట్టం చేయడానికి సుధాకర్‌రెడ్డి పాత్ర మరువలేనిదని సిపిఐ కొణిజర్ల మండల కార్యదర్శి గడల భాస్కర్‌రావు అన్నారు. మండల పరిదిలోని తనికెళ్ల సిపిఐ కార్యాలయంలో ఆదివారం సిపిఐ జాతీయ ప్రధాన కార్యదర్శి సురవరం సుధాకర్‌రెడ్డి సంతాపసభ సిపిఐ గ్రామ శాఖ కార్యదర్శి యాసా వెంకటేశ్వరరావు అధ్యక్షతన జరిగింది. ఈసభలో గడల భాస్కర్‌రావు మాట్లాడుతు పాఠశాలలో విద్యార్థిగా ఉన్నప్పుడే తరగతి గదిలో నల్లబోర్డు, సుద్దముక్కలు ఏర్పాటు చేయాని ఉపాధ్యాయులు భోదించడానికి అవి అత్యవసరమని ఆనాడే ఎలగెత్తి సమస్యలపై పోరాటం ప్రారంభించాడని తెలిపారు. దాని ఫలితంగా జిల్లా రాష్ట్ర విద్యాశాఖలు స్పందించి వెంటనే పాఠశాలల్లో నల్లబోర్డులు సుద్దముక్కలు ఏర్పాటు చేశారని పేర్కొన్నారు. పువ్వు పుట్టగానే పరిమళించినట్లు సుధాకర్‌రెడ్డి చిన్నప్పటినుంచే సామాజిక సమస్యలపట్ల స్పందించే వారని తెలిపారు. ఏఐఎస్ఎఫ్, ఏఐవైఎఫ్ విద్యార్థి యువజన సమాఖ్యలలో చేరి జాతీయ అధ్యక్షుడిగా ఎన్నిక కాబడిన వ్యక్తి సురవరం అని కొనియాడారు. ఈకార్యక్రమంలో సిపిఐ సీనియర్ నాయకులు గడల సీతారామయ్య, పివిరావు, పొట్లపల్లి సీతారాములు, బాసా నాగరాజు, బాణోత్‌రామయ్య, వీరయ్య, గుమ్మిడెల్లి సైదారావు, పసుమర్థి శంకర్ రావు, పసుమర్తి సత్యనారాయణ, పెదమళ్ల రత్తమయ్య, అన్నారపు వెంకయ్య మలిశెట్టి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

# యువజన కాంగ్రెస్ నాయకులు చిన్నబాబు మృతి



**ప్రజాపక్షం/కామేపల్లి:** మండలంలోని కొమ్మినేపల్లి గ్రామానికి చెందిన యువజన కాంగ్రెస్ మండల నాయకులు శివరాత్రి చిన్నబాబు(24) శనివారం అర్ధరాత్రి గుండెపోటుతో మృతి చెందారు. ఆయన మృతదేహాన్ని సందర్శించి కాంగ్రెస్ పార్టీ నేతలు పార్టీ జెండా కప్పి నివాళులర్పించారు. గ్రామంలో అంతిమయాత్ర భారీగా కొనసాగింది. ఈకార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు బానోత్ నరసింహ నాయక్, దమ్మాలపాటి సత్యనారాయణ, మద్దినేని రమేష్‌బాబు, మండల కాంగ్రెస్ పార్టీ బీసీ సెల్ అధ్యక్షులు చల్లా మల్లయ్య, యువజన కాంగ్రెస్ మండల అధ్యక్షలు దొడ్ల వేణు, కొండాయిగూడెం సొసైటీ అధ్యక్షులు డి హనుమంత రావు, గ్రామ శాఖ నాయకులు జక్కంపూడి వెంకటేశ్వర్లు, శీలం పుల్లయ్య, చల్లా మల్లయ్య, బండి ఉపేందర్, బత్తుల వీరబాబు, దేరంగుల తిరపయ్య, తురక బిక్షం, బత్తుల ఉపేందర్, తదితరులు పాల్గొన్నారు.

# ఉద్యోగాలు - ఉపాధి మార్గాలపై సెమినార్



**ప్రజాపక్షం/పాల్వంచ :** పారిశ్రామికీకరణ వల్ల ఉద్యోగ ఉపాధి అవకాశాలు మెరుగు పడతాయని అసిస్టెంట్ ప్రొఫెసర్ వేముల కామేశ్వరరావు, సింగరేణి మాజీ జిఎం శనగ వెంకటేశ్వర్లు అన్నారు. పాల్వంచ కొమరం భీమ్ హాల్‌లో బహుజన ఐక్య వేదిక ఆధ్వర్యంలో ఆదివారం ఉద్యోగాలు, ఉపాధి మార్గాలపై సెమినార్ నిర్వహించారు. ఈ సంధర్భంగా వారు మాట్లాడుతూ పారిశ్రామిక విధానం 1948, 1956, 1981 వరకు జరిగిన పరిణామాలను వివరించారు. పస్తుతం సరళీకరణ, ప్రవేటీకరణ, గ్లోబలైజేషన్ లపై సమగ్రంగా వివరించారు.ప్రస్తుత పరిస్థితుల్లో పరిశ్రమలను నెలకొల్పక పోవటం వలన జరిగే నష్టాలను తెలిపారు. ప్రవేటు, ప్రభుత్వ భాగస్వామ్యంలో పరిశ్రమలను స్థాపించడం వల్ల జరిగిన గ్లోబలైజేషన్ లో జరిగే లాభ నష్టాలను విపులంగా వివరించారు. ప్రస్తుతం కొత్త పరిశ్రమలను నెలకొల్పకపోవటం వలన యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లేకుండా పోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు.దీని వలన యువతలో నైరాశ్యం నెలకొని ఆత్మహత్యలకు దారితీస్తుందని వాపోయారు. పాల్వంచలో మూసి వేసిన విద్యుత్ ప్లాంటు స్థానంలో మరో 800 మెగా వాట్ల సామర్థ్యం కలిగిన ప్లాంటు నెలకొల్పాలని దీనితో స్థానిక యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు ఉంటాయని తెలిపారు. పరిశ్రమల్లో ప్రవేటు భాగస్వామ్యాలను తగ్గించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బహుజన ఐక్య వేదిక నాయకులు శ్రీపాద సత్యనారాయణ, బరగడి దేవదానం, శనగ రాంచందర్‌రావు, మల్లెల రామనాథం, రేగళ్ళ శ్రీను, మంజూర్, హుస్సేన్, రషీద్, బుడగం నాగేశ్వరరావు, సుగుణాకర రావు, రెంటాల లక్ష్మణ్, నిమ్మల రాం బాబు, దాసరి రమేష్, సత్యనారాయణ, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

# మట్టి గణపతే మేలు : తెల్లం



**ప్రజాపక్షం/భద్రాచలం :** మట్టి గణపతే మేలను, ప్లాస్టర్ ఆఫ్ ప్యారీస్ విగ్రహాలకు పర్యావరణానికి పెను ప్రమాదం పొంచి ఉందని ఎంఎల్‌ఏ డా.తెల్లం వెంకట్రావు అన్నారు. ఆదివారం భద్రాచలం కుమ్మరి సంఘం, శ్రీ మొల్ల స్వచ్ఛంద సేవా సంస్థ సభ్యులతో కలిసి ఆయన కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎంఎల్‌ఏ మాట్లాడుతూ ప్రకృతిని కాపాడుకోవాల్సిన అవసరం ప్రతీ ఒక్కరిపై ఉందన్నారు. పర్యావరణ పరిరక్షణ బావితరాల వారికి మేలు చేస్తుందని చెప్పారు. ఈ కార్యక్రమలో గంగాధర వీరయ్య, విజ్జగిరి రాజా కిరణ్, గంగాధర సతీష్, సద్దనపు సత్యనారాయణ, వి నరేష్, జల్లారపు సునీల్, సగ్గెం లక్ష్మణరావు, రెల్లి తాతారావు, కొలిచలం నవీన్, విజ్జిగిరి రవితేజ తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా కోయతూర్ సంస్కృతీ సాంప్రదాయ పండుగ



**ప్రజాపక్షం/కరకగూడెం:** కరకగూడెం మండలం రఘునాధపాలెం గ్రామంలో ఆదిమూలవాసులైన పూర్వ పెద్దల ఆనవాయితీ ప్రకారం, కోయ ఆదివాసీ సంస్కృతి సాంప్రదాయ ప్రతిబింబంగా ఆదివారం మగ మొదటి పాదం సందర్భంగా ప్రత్యేక పండుగ సామే కొత్తల (పొట్ట పండుగ)ను పోలెబోయిన, పులి వంశం వారు నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీ సమ్మక్క (ముసలమ్మ) ఆలయం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించగా, సంప్రదాయ నృత్యాలు, గట్టు గోత్రాల ఆచారాలు, తాళ మేళ మద్దెలతో కూడిన కోయతూర్ సంప్రదాయ కార్యక్రమాలు ఘనంగా జరిగాయి. ప్రకృతి సిద్ధమైన వరి, సామ కంకులతో జిబిలి నార తోరణాల అలంకరణ చేయగా, ఆలయం పండుగ వాతావరణంతో నిండిపోయింది. కోయ ఆదివాసీల జీవన విధానానికి మూలమైన ప్రకృతి పూజ, పంటల పట్ల కృతజ్ఞతా భావం, తల్లిదండ్రుల ఆశీర్వాదం, పెద్దల మార్గదర్శనం ఈ పండుగలో ప్రతిబింబించాయి. కార్యక్రమంలో గ్రామ పెద్దలు పోలెబోయిన బాబు, పోలెబోయిన వెంకటయ్య, పోలెబోయిన సత్యం, పోలెబోయిన లక్ష్మయ్య, పులి నారాయణ, పులి రామూర్తి, పోలెబోయిన సారయ్య, లక్ష్మయ్య, పులి రామకృష్ణ, సమ్మయ్య, గొంది బాలకృష్ణ, రవి, సోలం కృష్ణ పాల్గొన్నారు. యువత తరపున పోలెబోయిన రాంగోపాల్, పోలెబోయిన కార్తీక్, పోలెబోయిన రాజు, సిద్దు, పేరంటాం పోలెబోయిన మాణిక్యం తదితరులు పాల్గొన్నారు.

# క్రీడలు మానసికోల్లాసానికి దోహదం

**- 2కె రన్ విజయవంతం**



**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** క్రీడల మానసిక ఉల్లాసానికి, శారీర ధారుడ్యానికి ఎంతగానో ఉపయోగ పడతాయని జిల్లా యువజన, క్రీడల అధికారి పరంధామ రెడ్డి అన్నారు. ప్రముఖ హాకీ క్రీడాకారులు జ్ఞాన్‌చంద్ జన్మదినాన్ని పురస్కరించుకుని ఈనెల 29న జాతీయ క్రీడల దినోత్సవాన్ని నిర్వహించనున్నారు. ఈ మేరకు ఆదివారం స్థానిక పోస్టాఫీస్ సెంటర్ నుండి రైల్వే స్టేషన్ వరకు 2కే రన్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన జెండా ఊపి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ క్రీడలు మానసిక ఉల్లాసాన్ని ఎంతగా ఇస్తాయో, శరీర ధారుడ్యాన్ని కూడా అంతే ప్రసాదిస్తాయని చెప్పారు. తద్వారా ఆరోగ్యవంతమైన సమాజం ఏర్పడుతుందని తెలిపారు. యువత చెడు వ్యసనాలకు బానిసలు కాకుండా శరీర శ్రమ ద్వారా మంచి ఆరోగ్యం కోసం క్రీడా స్ఫూర్తితో ముందుకు సాగాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా క్రీడా సంఘాలు, క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

# సురవరం సుధాకర్‌రెడ్డికి పలువురి నివాళి



















